ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 23.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 3 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఇలాంటి వార్తలు ఎలా క్రియేట్ చేస్తార్రా? 8



రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

కాలానుగుణంగా పంటలను సాగు చేయాలి

రైతన్న సంతోషం కోసం ఓ అన్నగా బాధ్యత

> ఎన్నికల సమయంలో మాత్రమే మేము రాజకీయాలు మాట్లాడుతాం. ఎన్నికలు లేనప్పుడు అభివృద్ధి మా ప్రథమ ప్రాధాన్యం. అభివృద్ధి కోసం ప్రధానమంత్రి మోడీ దగ్గరకు వెళ్లడానికి నాకు ఎలాంటి భేషజాలు లేవు. ఈ ప్రాంత ఎమ్మెల్యే వచ్చి సమస్యలు చెబితే తప్పకుండా పరిష్కరిస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులతో నాకు వ్యక్తిగత ద్వేషం లేదు. కేవలం సిద్ధాంత వైరుధ్యం మాత్రమే ఉంది. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

- నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం.. రైతులకు అంకితం
- బయోమాస్ విద్యుత్ ప్లాంటు ప్రారంభం పామాయిల్ రిఫైనరీకి శంకుస్థాపన
- కొడంగల్లోనూ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు
- అభివృద్ధిలో వివక్ష పాటించడం లేదు
- రాష్ట్రంలోని 18 వేల పాఠశాలల ప్రక్షాళన
- పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి ఇబ్బందుల పాలు కావద్దు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులతో నాకు వ్యక్తిగత ద్వేషం లేదు
- మీ ఎమ్మెల్యే వచ్చి సమస్యలు చెబితే తప్పకుండా పరిష్కరిస్తా
- సిద్దిపేటలో కాంగ్రెస్ గెలిపిస్తే.. ఎమ్మెల్యేకు మంత్రి పదవి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నర్మెట నుంచి కత్తుల లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు / సిద్దిపేట,మార్చి 22: రైతులు కాలానుగుణంగా సాగు విధానాలను మార్చుకోవాలని రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. రైతు ఉత్సవాలు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్మెటలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించిన బయోమాస్ విద్యుత్ ప్లాంటును ప్రారంభించారు. రూ.80 కోట్లతో నిర్మించే పామాయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. రైతు భరోసా నిధులను విడుదల చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు వరి పంట మీద ఆధారపడకుండా డిమాండ్ ఉన్న పంటలను పండించేందుకు ముందుకు రావాలని సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను పండించేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. తెలంగాణలోని 12,728 గ్రామపంచాయతీలలోని రైతులంతా ప్రతిరోజు కారులో తిరిగే విధంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ధ్యేయమన్నారు. రైతులు చిరుధాన్యాలు ఆకుకూరలు వంటి పంటలను పండించేందుకు ముందుకు రావాలని కోరారు. ఇతర పంటలకు మళ్ళితే నష్టపోతామనే భయాన్ని రైతులు పెట్టుకోవద్దని సూచించారు. రైతులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం 114 నెలల కాలంలో రైతుల కోసం నెలకు రూ.2533 కోట్లు ఖర్చు చేస్తే 28 నెలల్లో తమ ప్రభుత్వం నెలకు రూ.5500 ఓట్లు ఖర్చు చేసిందని చెప్పారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నదనడానికి ఇంతకు మించిన సాక్ష్యం ఏముంటుందని చెప్పారు. వ్యవసాయంలో సాంకేతిక నైపుణ్యాన్ని అందించి అన్నదాతలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రైతన్న సంతోషం కోసం ఓ అన్నగా

...:: మిగతా 2లో

తెలంగాణ పునర్నిర్మాణంలో ఆర్య వైశ్యుల పాత్ర కీలకం



- ఆర్యవైశ్య సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, గౌరవం
- రాజకీయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తాం
- శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 22: తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వాసవీ అమ్మవారి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, అందుకు సంబంధించి శాసనసభ సమావేశాలు ముగిసేలోగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. 'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆర్యవైశ్యులు వెన్నెముక లాంటి వారు. తెలంగాణ పునర్నిర్మాణంలోనే కాకుండా సంస్కృతి, ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుంది. మీ ఆలోచనలే ప్రజా ప్రభుత్వం. ఆర్యవైశ్యుల గుర్తింపు విషయంలో ఎలాంటి భంగం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఈ మహోత్సవంలో

...:: మిగతా 2లో

మాపై అమెరికా దాడిచేస్తే

మేం భారత్‌పై దాడిచేస్తాం



...:: 7లో

- పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ దురుసు వ్యాఖ్యలు

పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ తన నోటి దురుసును ప్రదర్శించారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడిచేస్తే అందుకు ప్రతీకారంగా తాము భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ, ముంబై నగరాలపై తాము బాంబు దాడులకు దిగుతామని బాసిత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.



భారత్ చేరుకున్న మరో ఎల్పీజీ నౌక

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ మరో ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరుకుంది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం, నెదర్లాండ్ పోర్ట్ నుంచి పైక్సిస్ పయనీర్ అనే భారీ ఎల్‌పీజీ నౌక కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరుకుంది.

7



నిందితుల ఫొటోలు ఆన్‌లైన్‌లో ఉంచుతారా?

మొబైల్ ఫోన్లలో చిత్రించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ధోరణి పట్ల సుప్రీం కోర్టు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతుందని పేర్కొంది.

7



ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలి

అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్ శాసనసభ ఎన్నికలతో పాటు మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది.

7



ప్రభుత్వం ప్రోటోకాల్ ఉల్లంఘించింది

ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ నిబంధనలను పాటించడం లేదని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు.

3



గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో

ఇబ్బందులుండొద్దు

రాష్ట్రాలకు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా పెంపు

- విద్యా కేంద్రాలు, ఆస్పత్రులకు గ్యాస్ పంపిణీకి ప్రాధాన్యం
- కొత్తగా పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్రం సూచన
- కేంద్ర మంత్రులతో ప్రధాని ఉన్నత స్థాయి సమావేశం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 22: పశ్చిమాసియా యుద్ధం తీవ్రతతో దేశంలో నెలకొన్న గ్యాస్ సంక్షోభం, ముడి చమురు కొరత వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం సీనియర్ మంత్రులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ నిల్వలు, విద్యుత్, ఎరువులు సరిపోను ఉన్నాయా? లేదా? అనే అంశంపై కేంద్ర మంత్రులతో ప్రధాని ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరాలైన గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో అంతరాయం లేకుండా చూడాలని మోడీ సూచించారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావంతో భారత్ ఇంధన కొరత, గ్యాస్ సరఫరాపై అనిశ్చితి నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఇంధన భద్రత, సరిపోను నిల్వలు ఉండేలా చూసుకోవడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించడం వంటి వాటిపై దృష్టి సారించారు. గ్యాస్, ముడి చమురు, విద్యుత్, ఎరువులు వంటి వాటిని నిరంతర సరఫరా చేయడం, వీటి పంపిణీలో అలసత్వం ప్రదర్శించకూడదనే అంశాలపై కేంద్ర మంత్రులతో

...:: మిగతా 2లో

ఇక కాంగ్రెస్‌లో ఉండలేను..

25న పార్టీకి రాజీనామా చేస్తున్నా



- 20 నెలలుగా మానసిక క్షోభను అనుభవిస్తున్నా
- మానసిక క్షోభతో పార్టీలో కొనసాగడం సాధ్యం కాదు
- మానసిక స్థైర్యం కలగిస్తూ మార్గదర్శకంగా నిలవండి
- కార్యకర్తలకు కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి లేఖ

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల

మార్చి 22: కాంగ్రెస్ లో కొనసాగలేనని, ఈ నెల 25న పార్టీకి రాజీనామా చేస్తున్నానని కాంగ్రెస్‌సీనియర్ నేత జీవన్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు పార్టీని వీడటానికి గల కారణాలపై కార్యకర్తలకు లేఖ రాశారు. గత 20 నెలలుగా మానసిక క్షోభను అనుభవిస్తున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. అవమానాలు భరిస్తూ కాంగ్రెస్‌లో ఉండలేనని లేఖలో స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా తనతో కలిసి ప్రయాణం చేసిన రాజకీయ సహచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులను ఉద్దేశించి జీవన్ రెడ్డి లేఖ రాశారు. గత 20 నెలలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను మీరంతా గమనిస్తున్నారని

...:: మిగతా 2లో



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం


- వెనక్కి తగ్గని ఇజ్రాయెల్, ఇరాన్
- ఇజ్రాయెల్‌అణు పరిశోధన కేంద్రం సమీపంలో ఇరాన్ క్షిపణి దాడులు
- హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలి: ట్రంప్ వార్నింగ్
- గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మేం వస్తాం : ఇరాన్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియా యుద్ధం కొనసాగుతోంది. యుద్ధాన్ని ముగించాలని అమెరికా అనుకున్నా.. ఇజ్రాయెల్ , ఇరాన్ వెనక్కి తగ్గడం లేదు. శనివారం ఇరాన్‌లోని నటాంజ్ అణు కేంద్రంపై యూఎస్, ఇజ్రాయెల్ దళాలు మరోసారి దాడి చేయడం ఇందుకు కారణం. ఆదివారం నుంచి ఇరాన్‌పై తమ దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఇంకోవైపు ప్రపంచ దేశాలు యుద్ధం పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశాయి. యుద్ధాన్ని

...:: మిగతా 2లో

డా.పొన్నం రవిచంద్రకు ఉగాది జీవన సాఫల్య పురస్కారం



ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 22: తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, హైదరాబాద్ శ్రుతిలయ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతి ఏటా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి ఇస్తున్న మాదిరిగా ఈ ఏడాది శ్రుతిలయ సీల్ వెల్ "ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు 2026" లో భాగంగా డా. పొన్నం రవిచంద్ర కు "ఉగాది జీవన సాఫల్య పురస్కారం" ప్రకటించారు. ఈ నెల 24వ తేదీన త్యాగరాయ గానసభలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాలని రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఛైర్మన్ జి. చిన్నారెడ్డి, మాజీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కోలేటి దామోదర్ చేతుల మీదుగా అందచేయనున్నట్లు అవార్డు కమిటీ ఛైర్మన్ మహ్మద్ రఫీ, శ్రుతిలయ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీమతి ఆమని తెలిపారు. నంది అవార్డుతోపాటు, వరసగా రెండుసార్లు గద్దర్ పురస్కారాన్ని అందుకున్న రవిచంద్ర ఫిల్మ్ జర్నలిస్ట్ గా, డాక్యుమెంటరీ నిర్మాతగా సినిమా రనగంలో కృషి చేస్తున్నందుకు గాను ఉగాది జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. రవిచంద్రతో పాటు సీనియర్ యాంకర్ గాయత్రీ రావు, సీనియర్ వెటరన్ జర్నలిస్ట్ శ్రీనివాసరెడ్డి, రాజ్ న్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రోజా స్వర్ణ, మన తెలంగాణ చీఫ్ ఫోటో జర్నలిస్ట్ పరమేశ్వర్, ఎన్టీవీ సీనియర్ న్యూస్ ప్రెసెంటర్ వి. స్వర్ణ ప్రియ, సీనియర్ జర్నలిస్ట్, ఐ డ్రీమ్స్ పొట్లపల్లి స్వరూప, సీనియర్ హోస్ట్, సోషల్ పోస్ట్ మాధురి జి. ఎస్. కె, సీనియర్ హెల్త్ జర్నలిస్ట్ రచన ఎం., సీనియర్ కల్చరల్ జర్నలిస్ట్ ఎం. శ్రీనివాస్, వి 6 కల్చరల్ జర్నలిస్ట్ ఎం. కల్పనకు ఉగాది మీడియా విశిష్ట ప్రతిభా పురస్కారాలను అందచేయనున్నట్లు వారు తెలిపారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో ఆర్య వైశ్యుల పాత్ర కీలకం

మొదటిపేజీ తరువాయి

వాసవీ సామూహిక పారాయణం గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా. ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుంది.' అని సీఎం అన్నారు. అహింసతో ఒక యుద్ధాన్ని గెలవొచ్చని నిరూపించిన గొప్ప తత్వవేత్త మహాత్మ గాంధీ ఈ జాతిలో పుట్టడం భారతదేశానికే గర్వకారణమని, అహింస, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం దేశానికి స్వాతంత్ర్యం సాధించవచ్చన్న నూతన విధానాన్ని మహాత్మా గాంధీ ప్రపంచానికి పరిచయం చేశారని అన్నారు. మహాత్మా గాంధీ వారసత్వంలో శాంతియుతంగా అహింసా మార్గంలో ఈ దేశ అభివృద్ధికి, రాజకీయాల్లో అవకాశాలు వచ్చినా, రాకున్నా ఎక్కడా క్రమశిక్షణ ఉల్లంఘించకుండా ఆర్య వైశ్యులు దేశంలో గుర్తింపు సాధించారని అన్నారు. 'ఆర్య వైశ్య సామాజిక వర్గానికి తెలంగాణలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుంది. మీ అభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలు, కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని, మీ గుర్తింపు, గౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్య వైశ్యులకు ఆరు మున్సిపల్ ఛైర్మన్ పదవులతో పాటు ఒక మేయర్ పదవి ఇచ్చి గౌరవం కల్పించామని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా వారికి సముచితమైన స్థానాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు బెల్డి శ్రీధర్ తో పాటు ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు.

గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో ఇబ్బందులుండొద్దు

మొదటిపేజీ తరువాయి

మోదీ చర్చించారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ అత్యవసర భేటీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల శాఖామాత్యులు ఎస్.జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ అత్యవసర సమావేశంలో మంత్రి వర్గంతో చర్చించిన మోడీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతానికి మధ్యంతర చర్యల్లో భాగంగా కేంద్రం అన్ని రాష్ట్రాలకు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను పెంచింది. విద్యా కేంద్రాలు, ఆస్పత్రులకు గ్యాస్ పంపిణీకి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది. గృహోపయోగానికి, కమర్షియల్ వినియోగదారులకు కొత్తగా పీఎన్జీ(పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్లు ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

ఇక కాంగ్రెస్‌లో ఉండలేను..

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంకా అవమానాలకు గురవుతూ.. మానసిక క్షోభతో కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం సాధ్యం కాదని అన్నారు. భవిష్యత్ ప్రణాళికపై మార్చి 25న నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఇందుకోసం జగిత్యాల పట్టణం గొల్లపల్లి రోడ్డులోని బండారి గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొని మీ సూచనలతో పాటు, రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, అండదండలతో, మానసిక స్థైర్యం కలగిస్తూ మార్గదర్శకంగా నిలవాలని కార్యకర్తలను కోరారు. ఇక ఈ నెల 27 నుంచి జీవన్ రెడ్డి గ్రామాల బాట కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో తనకు జరిగిన అన్యాయం గురించి ప్రజలకు వివరించి, పార్టీ మార్పుపై ప్రజాభిప్రాయం సేకరించనున్నారు. కాగా, మంత్రులు చెప్పినా, హైకమాండ్ వద్దన్నా జీవన్ రెడ్డి రాజీనామాకే సిద్ధపడ్డారు. నిన్న రాష్ట్ర మంత్రులు జీవన్ రెడ్డిని కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ, ఆయన తన మనసులోని మాటను వారికి స్పష్టంగా తెలియజేశారు.

ఆత్మాభిమానం చంపుకొని కొనసాగలేను

మీకో దండం. మీ పార్టీకో దండం. ఇంతదూరం వచ్చి నన్ను కలిసినందుకు ధన్యవాదాలు. పార్టీలో కొనసాగడం మాత్రం ఇక జరిగే పనికాదంటూ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి మంత్రులకు స్పష్టంచేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చి గంటకుపైగా ఆ యనతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, 20 నెలల క్రితం సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డికి ప్రాధాన్యత తగ్గిపోవడం, పార్టీ ఫిరాయించి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అధిష్ఠానం, సీఎం రేవంత్ మద్దతు పలుకడంతో జీవన్‌రెడ్డి మానసిక వేదనకు గురవుతూ వస్తున్నారు.

కాలానుగుణంగా పంటలను సాగు చేయాలి

మొదటిపేజీ తరువాయి



తాను బాధ్యత తీసుకున్నానని పేర్కొన్నారు. రైతును ధైర్యంగా సాగులో నిలబెట్టేందుకు తాను భరోసా ఇస్తున్నానని చెప్పుకొచ్చారు. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు నేడు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామ వేదికగా మరోసారి రైతు కళ్లలో ఆనందం చూడాలని ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులకు మించి వరి ధాన్యాన్ని కొనలేమని స్పష్టం చేసిందని తెలిపారు. అయినా రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించిందని తెలిపారు. ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం లేనందున వరి రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆకుకూరలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఇతర డిమాండ్ ఉన్న పంటలను పండించాలని కోరారు. రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు సాగయ్యాయని చెప్పారు. పది లక్షల ఎకరాలలో ఈ తోటలు సాగైనా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. లాభసాటి పంట అయిన పామాయిల్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని చెప్పారు. పామాయిల్ సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎకరానికి రూ.4200లకు తోడు రాష్ట్ర ప్రభుత్వం అంతే మొత్తంలో అందించేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. తన నియోజకవర్గమైన కొడంగల్ లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సభా వేదిక నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ముఖ్యమంత్రి కోరారు.

కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల మహిళలకు రూ.57 వేల కోట్ల బ్యాంకు లింకేజీ తో రుణాలు అందించినట్లు తెలిపారు. వీటికి సున్నా శాతం వడ్డీ కింద రూ1350 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాలలో 67 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, ఇంకా మహిళలందరినీ చేర్పించి కోటి మందితో స్వయం సహాయక బృందాలలోని మహిళలను 2034 నాటికి కోటీశ్వరులను చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

పాఠశాలలో నర్సరీ నుంచి తరగతులు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగానే రాష్ట్రంలోని 18 వేల పాఠశాలలను ప్రక్షాళన చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి తరగతులను ప్రారంభిస్తామన్నారు. వారంలో మూడు రోజులు విద్యార్థులకు పాలు, మూడు రోజులు రాగి జావా అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే ఉపాధ్యాయులు ఉన్నారని వారి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలలో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందుల పాలు కావద్దని సూచించారు. యువతకు సాంకేతిక నైపుణ్యం కలిగిన కోర్సులలో శిక్షణ ఇప్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్, ఐటిఐలలో ఉపాధిని కల్పించే సాంకేతిక నైపుణ్యం కలిగిన కోర్సులను నేర్పిస్తామని చెప్పారు.

ఎన్నికలప్పుడే రాజకీయాలు

ఎన్నికల సమయంలో మాత్రమే తాము రాజకీయాలు మాట్లాడుతామని చెప్పారు. ఎన్నికలు లేనప్పుడు అభివృద్ధి తమ ప్రథమ ప్రాధాన్యం అన్నారు. అభివృద్ధి కోసం తాను ప్రధానమంత్రి మోడీ దగ్గరకు వెళ్లడానికి ఎలాంటి భేషజాలు లేవన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే వచ్చి సమస్యలు చెబితే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులతో తనకు వ్యక్తిగత ద్వేషం లేదని చెప్పారు. వారితో కేవలం సిద్ధాంత వైరుధ్యం మాత్రమే ఉందని పేర్కొన్నారు. వారు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాలను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మొత్తం 10,500 ఇందిర ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు తెలిపారు. యుద్ధం వల్ల విదేశాల నుంచి దిగుమతి కావలసిన ఎరువులు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి పూర్తిగా ఎరువులను రాష్ట్రానికే కేటాయించాలని ప్రధానమంత్రిని కోరుతామని చెప్పారు. ఇందుకోసం బిజెపి ఎంపీలతో పాటు కాంగ్రెస్ ఎంపీలను తీసుకుని వెళ్లి ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలుస్తామని చెప్పారు. అభివృద్ధి కోసం ఎవరి దగ్గరికి అయినా వెళ్లడానికి తమ సిద్ధంగా ఉన్నామని, అలా వెళ్లడం వల్ల ఎవరు ఎవరికో వంగినట్లు లొంగినట్లు కాదని పేర్కొన్నారు.

సిద్దిపేటలో కాంగ్రెస్‌గెలిపిస్తే.. ఎమ్మెల్యేకు మంత్రి పదవి

సిద్దిపేట నియోజకవర్గంలో 1985 నుంచి ఈ కుటుంబం ప్రాతినిధ్యం వహిస్తోందని 2029 ఎన్నికల్లో ప్రజలు మార్పు చూపించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రిని చేస్తామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో తనకు వివక్ష లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తనకు సిద్దిపేట పట్ల వివక్ష ఉంటే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నర్మెటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తమకు వివక్ష ఉంటే ప్రాజెక్టును ఎందుకు మంజూరు చేస్తామని ప్రశ్నించారు. సిద్దిపేట ఎమ్మెల్యే అలాంటి ఆలోచనలను పక్కనపెట్టి సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. తమ దృష్టికి తీసుకు రాకపోయినా ఇతర నియోజకవర్గాలతో సమానంగా అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని సమస్యలపై సమగ్ర నివేదికతో వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల పట్ల గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందేనన్నారు. రైతుల ఇళ్ల విద్యుత్తు తొలగించి, ఇళ్లలోకి నీటిని వదిలి మల్లన్న సాగర్ నిర్వాసితులను ఖాళీ చేయించారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.20 లక్షల నష్టపరిహారం ఇచ్చి 98.5 శాతం మంది రైతులు ఒప్పుకున్నతర్వాతనే తర్వాతనే ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు.

ఆర్థిక వెసులు బాటు లేకపోయినా 21 లక్షల కోట్ల రుణ మాఫీ

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ఒకే దఫాలో రూ.21 లక్షల కోట్ల పంట రుణాలు మాఫీ చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో కూర్చున్న వారు గోతి వద్ద గుంట నక్కల్లా ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ తమ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. యూరియా కోసం పది సార్లు కేంద్రమంత్రిని కలిసి యూరియా గత లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి చేసుకుని వ్యవసాయాన్ని కొనసాగించడం ద్వారా ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఎన్ని చెప్పినా, గుంటనక్కలు కారు కూతలు కూసినా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. నర్మెటలోని ఆయిల్ పామ్ కర్మాగారాన్ని తాము మంజూరు చేశామని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిధులు విడుదల చేయకుండా జీవో జారీ చేస్తే ప్రాజెక్టు పూర్తయినట్టేనా అని ప్రశ్నించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు అడ్వాన్సుడ్‌టెక్నాలజీలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులందరికీ నాణ్యత నైపుణ్యంతో కూడిన విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ తపాసు పల్లి రిజర్వాయర్ నుంచి గజ్వేల్ నియోజకవర్గంలోని బందారం తదితర 10 గ్రామాలకు సాగునీటిని అందించడంతోపాటు, మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు పంట కాలువలను పూర్తి చేసి తాగునీటిని అందివ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లాలోని వివిధ సమస్యలపై విజ్ఞాపన పత్రాన్ని అందించారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 3:38 గంటలకు నంగునూరు మండలం నర్మెట చేరుకున్నారు. జిల్లాలో రూ.775.71 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి నంగునూరు మండలం నర్మెట వేదికగా ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. నంగునూరు మండలం నర్మెటలో మధ్యాహ్నం 3:58 గంటలకు రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ ఫామ్ కర్మాగారంతో పాటు కర్మాగారం ఆవరణలో నిర్మించిన నాలుగు మెగావాట్ల బయోమాస్ విద్యుత్ ప్లాంటును ప్రారంభించారు. రైతు మహోత్సవంలో అక్కడే చేసిన వ్యవసాయం దాని అనుబంధ రంగాలతో ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను సందర్శించారు. ఆయిల్ పామ్ కర్మాగారంలో భాగమైన రూ.80 కోట్లతో ఏర్పాటు చేసే పామాయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీలో యూఐడీఎఫ్ నిధులు రూ.141.34 కోట్లతో తాగునీటి సరఫరా భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నంగునూరు మండలం గట్లమల్యాలలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిద్దిపేట జిల్లా కేంద్రం శివారులోని సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి వద్ద రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లా కారాగారం, రూ.15కోట్లతో నిర్మించిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి, రూ.3.6 కోట్లతో చేపట్టిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్(కేంద్రీకృత మందుల నిధి), సిద్దిపేటలోని ఎన్ జీ వో కాలనీలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్ సీ), జగదేవ్ పూర్ లో రూ.9.65 కోట్లు, మర్కుక్ లో రూ.8.65 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. కొండపాక లో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ సముదాయం, మర్కుక్ లో రూ.16.62 కోట్లతో నిర్మించే పబ్లిక్ స్కూల్ శంకుస్థాపన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘు నందన రావు, పోచారం శ్రీనివాస రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, టీ జీ ఐ ఐ సీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, శాసనమండలి సభ్యుడు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, బీర్ల ఐలయ్య, నవీన్ యాదవ్, సంజీవ రెడ్డి, తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నర్మెట పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీకి వెళ్లే దారుల్లో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. కేవలం పాసులు ఉన్న వారిని మాత్రమే స్టాళ్ల వద్దకు అనుమతీయించారు. సభకు వచ్చే రైతులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపంచారు. రైతు మహోత్సవంలో భాగంగా ఉగాది నాడు వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించినపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య నినాదాలు, తోపులాట జరిగింది. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రైతు భరోసా విడుదల చేయక పోవడం, రైతు రుణమాఫీ పూర్తిగా చేయక పోవడం, ఎరువుల కొరత, వడగళ్ల వాన నష్ట పరిహారం, ఇన్పుట్ సబ్సిడీ వంటి వాటితో పాటు సిద్దిపేట నియోజకవర్గంలో రద్దు చేసిన అభివృద్ధి పనులపై సీఎంను రైతులు నిలదీయాలని పిలుపు ఇచ్చారు. దీనికి తోడు విశ్రాంత ఉద్యోగులు తమ బకాయిలు చెల్లించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు నర్మెటకు తరలి రావాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు ఇచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు విశ్రాంత ఉద్యోగులను ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నర్మెటలో పటిష్ట బందోబస్తు చేపట్టారు.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం

మొదటిపేజీ తరువాయి

ఆపాలని 22 దేశాలు ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశాయి. నటాంజ్ అణు కేంద్రంపై జరిగిన దాడిలో రేడియో ధార్మిక పదార్థాలేవీ లీక్ కాలేదని ఆ దేశ అటమిక్ అనర్జీ ఆర్గనైజేషన్ తెలిపింది. కేంద్రం పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపింది. తాజా దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం, ఇతర అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించాయని ఆరోపించింది.

ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రం సమీపంలో ఇరాన్ క్షిపణి దాడులు

పశ్చిమాసియాలో పరస్పర దాడులతో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రం సమీపంలోని డిమోనా, అరద్ ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. ఈ ఘటనలో పిల్లలు సహా 100మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఇరాన్ క్షిపణి దాడిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. శత్రువులపై అన్ని రంగాల్లో ప్రతిదాడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రకారం, ఇరాన్ క్షిపణులు నేరుగా పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడి చేశాయని పేర్కొంది. దీని వల్ల అరుద్, డిమోనా ప్రాంతాలు ధ్వంసమయ్యాయని, 100 మందికిపైగా గాయపడ్డారని తెలిపింది. దీనిని ఉగ్రవాద చర్య, యుద్ధ నేరంగా అభివర్ణించింది. ఇదిలా ఉండగా దాడి జరిగిన ప్రాంతం నుంచి సుమారు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ వైమానిక దళం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టింది. ఒక బాలిస్టిక్ మిసైల్‌ను అడ్డుకునే ప్రయత్నంలో రెండు సార్లు విఫలమైనట్లు సమాచారం. మరోవైపు ఇజ్రాయెల్‌లోని డిమోనాలో క్షిపణి దాడిని అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ) ధృవీకరించింది. అయితే నెగెవ్ అణు పరిశోధనా కేంద్రానికి నష్టం వాటిల్లినట్లు ఎలాంటి సమాచారం లేదని తెలిపింది. అలాగే ఎలాంటి అసాధారణ రేడియేషన్ స్థాయిలను గుర్తించలేదని పేర్కొంది.

అన్ని రంగాల్లో శత్రువులను ఎదుర్కొంటాం: నేతన్యాహు

ఈ ఘటనపై ప్రధాని నెతన్యాహు స్పందించారు. గాయపడిన వారికి తక్షణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. 'ఇది మన భవిష్యత్తుకు సంబంధించిన కఠిన సమయం. గాయపడిన వారందరికీ ప్రార్థనలు చేస్తున్నాం. అన్ని రంగాల్లో శత్రువులను ఎదుర్కొంటాం' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఘటన స్థలంలో పనిచేస్తున్న అత్యవసర సేవా బృందాలకు నెతన్యాహూ అభినందనలు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు.

కొత్త వ్యూహాలతో ముందుకు వస్తాం: ఐఆర్జీసీ

మరోవైపు ఇజ్రాయెల్‌లోని డిమోనా, అరాద్ నగరాలపై జరిగిన క్షిపణి దాడుల తర్వాత ఇరాన్ సైనికాధికారులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల ఆకాశంపై తమ మిసైల్ ఆధిపత్యం నెలకొన్నట్లు ఇరాన్ ఐఆర్జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ అధిపతి మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ మూసావి తెలిపారు. ఇజ్రాయెల్ గగనతలం రక్షణ లేకుండా పోయిందని వ్యాఖ్యనించారు. ఇకపై జరగబోయే దాడులు అమెరికాఇజ్రాయెల్ కమాండర్లను ఆశ్చర్యపరుస్తాయని అన్నారు. కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలి: ట్రంప్ వార్నింగ్


48 గంటల్లోగా ఇరాన్ ఎటువంటి బెదిరింపు లేకుండా హర్మూజ్ జలసంధిని తెరవకపోతే, ఆ దేశంలోనే అతి పెద్దదైన విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇనాన్‌ను తీవ్ర హెచ్చరిక చేశారు. ట్రూత్ సోషల్ వేదికగా డోనాల్ట్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ ద్వారా తమ లక్ష్యాలకు చేరువైనట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్య గురించి ట్రంప్ తెలిపారు. ఇరాన్‌కు చెందిన క్షిపణి సామర్థ్యం, లాంచర్లు, ఇతర ఆయుధాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఇరాన్ ఇండస్ట్రియల్ బేస్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశ నేవీ, ఎయిర్ ఫోర్స్‌ను కూడా దెబ్బతీశామన్నారు. యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ ఆయుధాలను కూడా ధ్వంసం చేశామన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేసే సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీశామన్నారు. పశ్చిమాసియాలోని తమ మిత్ర దేశాలను రక్షించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ ఇతర దేశాల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కీలకమైన హోర్ముజ్ జలసంధికి రక్షణ ఏర్పాటు చేయాలని, ఆ జలసంధిని వినియోగించే దేశాలు దానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరికైనా ఈ అంశంలో సహాయం అవసరమైతే తాము ఆ దేశాలను ఆదుకోనున్నట్లుచెప్పారు.

గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మేం వస్తాం : ఇరాన్

అమెరికాతో యుద్ధం వేళ డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్ ద్వీపంపై ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఒకవేళ యూరోపియన్ యూనియన్ (ఈయూ) పిలిస్తే, వెంటనే గ్రీన్‌లాండ్‌ను రక్షించడానికి వెళ్తామని తెలిపింది. తాజాగా ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేశారు. "గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని అమెరికాకు ఇచ్చేయాలని తొలుత ఈయూను ట్రంప్ బెదిరించారు. అనంతరం అదే ఈయూతో ట్రంప్ ప్రాధేయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు ఈయూ సైనిక సాయం చేయకుంటే, గ్రీన్‌లాండ్‌ను లాక్కుంటామని ఇప్పుడు మళ్లీ ట్రంప్ బెదిరిస్తున్నారు. ఒకవేళ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేని పరిస్థితిలో ఈయూ ఉంటే, ఇరాన్‌ను పిలవండి. గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మాదేశం వస్తుంది" అని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు.

ఈ దాడితో తమకు సంబంధం లేదన్న ఇరాన్

హిందూ మహాసముద్రంలోని డియాగో గార్షియా ద్వీపంలో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరంపై జరిగిన మిస్సైల్ దాడిలో తమ పాత్ర లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి ఈ విషయాన్ని చెప్పారంటూ అల్ జజీరా ఆదివారం రోజు ఒక కథనాన్ని ప్రసారం చేసింది.



సేవ చేయడం అంటే ఇతరులకు ఉపకారం చేయడం కాదు, అది ఒక బాధ్యత. నిస్వార్థంగా సేవ చేస్తే కల్మషాలు తొలగిపోయి ఆత్మశుద్ధి జరుగుతుంది. కేవలం ఎన్నికల సమయంలోనో, స్వార్థ ప్రయోజనాల కోసమో చేసే పనులు ఎక్కువ కాలం నిలబడవు. కోరికలు తీరగానే అలాంటి వారు సేవను వదిలేస్తారు. భయం వల్ల లేదా బలవంతంగా చేసేది కూడా నిజమైన సేవ అనిపించుకోదు.

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



రాష్ట్రీయం

భూసేకరణ ప్రక్రియ నిలిపివేయాలి

- రాపోలులో బాధిత రైతుల సమావేశం
- సారవంతమైన భూముల స్వాధీనం అన్యాయం
- భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు



ప్రతిపక్షం, వికారాబాద్, మార్చి 22: పరిగి మండలం రాపోలు గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు కోసం జరుగుతున్న భూసేకరణపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా సాగుతున్న భూసేకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, 2013 కేంద్ర భూసేకరణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి తమ సమస్యలను వివిధ రూపాలలో తెలియజేయాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం గ్రామంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. రాపోలు గ్రామానికి చెందిన అసైన్డ్ మరియు పట్టా భూముల సాగుదారులు తరతరాలుగా ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని రైతులు తెలిపారు. ప్రస్తుతం రెండు పంటలు పండే సారవంతమైన భూములను పారిశ్రామిక పార్కు పేరుతో స్వాధీనం చేసుకోవడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ ప్రక్రియలో పలు చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నాయని రైతులు పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టంలోని నిబంధనలను పాటించకుండా, 2016 నిబంధనల ప్రకారం ముందుకు సాగుతున్నారని విమర్శించారు. భూములు కోల్పోతున్న రైతులకు వ్యక్తిగత నోటీసులు ఇవ్వలేదని, సామాజిక ప్రభావ అంచనా నిర్వహించకుండానే భూసేకరణ చేపడుతున్నారని ఆరోపించారు.అసైన్డ్ భూముల రైతులకు కూడా చట్టబద్ధంగా పరిహారం మరియు పునరావాసం కల్పించాల్సిన హక్కు ఉన్నప్పటికీ, ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని తెలిపారు. అలాగే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 2016 నిబంధనల ప్రకారం జరుగుతున్న భూసేకరణను వెంటనే నిలిపివేసి, 2013 చట్టాన్ని అమలు చేయాలని గ్రామస్థులు స్పష్టం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ రద్దు అయ్యేవరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని, మండలంలోని ఇతర గ్రామాలను కూడా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

ప్రభుత్వం ప్రోటోకాల్ ఉల్లంఘించింది

- సిద్దిపేట నియోజకవర్గంలో రూ.1070 కోట్ల పనులు రద్దు చేశారు
- నిరసనగా ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొనడం లేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 22: ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ నిబంధనలను పాటించడం లేదని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. ఆదివారం ఆయిల్ పామ్ కర్మాగారం ముఖ్యమంత్రి ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను స్థానిక ప్రజా ప్రతినిధుల ఫోటోలను పెట్టలేదని చెప్పారు. జిల్లాతో సంబంధం ఉన్న ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర రెడ్డి తదితరుల ఫోటోలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. సిద్దిపేట జిల్లాలో 2021లో మొదటి పామాయిల్ మొక్కను తామే నాటినట్లు చెప్పారు. పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ కోసం 62 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించి, కర్మాగారం నిర్మాణానికి ఆనాటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు కాంగ్రెస్ పార్టీ ప్రారంభోత్సవాలు చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనికి తోడు సిద్దిపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1070 కోట్ల విలువజేసే పనులను రద్దు చేసిందన్నారు. ఇందుకు నిరసన తెలుపుతూ సీ ఎం పర్యటనలో పాల్గొనడం లేదన్నారు.

దుబ్బాక నియోజకవర్గ గ్రామాలకు

మల్లన్న సాగర్ నీటిని అందించాలి

- నర్మెట్టలో సీఎం పర్యటనలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు వినతి పత్రం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 22: సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామం లో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు ఆయనను కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో గజ్వేల్‌లో రింగ్ రోడ్ పనులను పూర్తి చేయాలని, మల్లన్న సాగర్ కింద దుబ్బాక నియోజకవర్గ గ్రామాలకు నీటిని అందించాలని కోరారు. అలాగే తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని గ్రామాలకు నీటి సరఫరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇక 765 డిజి జాతీయ రహదారిపై హబ్సిపూర్ నుంచి దుబ్బాక అంబేద్కర్ విగ్రహం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం, ఎనగుర్తి చౌరస్తా నుంచి బొప్పాపూర్ మీదుగా శిలాజీనగర్ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొండపాక మండల కేంద్రంలో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు.మెదక్ జిల్లా, సంగారెడ్డి జిల్లా లో ఆయిల్ పామ్ కంపెనీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీ వినతి పత్రంలో పేర్కొన్నారు.



చిన్న షాపూర్‌లో భవనమ్మ బోనాల కోలాహలం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 22 : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న షాపూర్ గ్రామంలో భవనమ్మ ఆలయ తృతీయ ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 17వ వార్డు కౌన్సిలర్ పావని జగన్మోహన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామం వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ ఉత్సవాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నగరంలో భగవద్గీత పారాయణం

ప్రతిపక్షం, చేవెళ్ళ, మార్చి 22: భగవద్గీత సందేశాలు ప్రతి కుటుంబంలో ఆచరణలోకి రావాలని మా గీతా వాహిని బృందం కృషి చేస్తోందని గీతావాహిని సభ్యులు తెలిపారు. ఆదివారం నగరంలోని గచ్చిబౌలి జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాతృమండలి గీతావాహిని బృందం పాల్గొని గీతా పారాయణం చేశారు. గీతా శ్లోకాలతో ప్రాంగణం భక్తిమయంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. గీతావాహిని బృందం సమూహంగా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు గీతా బోధనలు జీవితంలో పాటించాలని సూచించారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎడ్యుకేషన్ స్టాల్

- ప్రభుత్వ విద్యార్థులతో మాట్లాడిన సీఎం
- బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచన
- విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు చెప్పిన సీఎం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 22: నర్మెట లోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు చెందిన స్టాళ్లలో విద్యాశాఖ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ స్టాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ స్టాల్ వద్ద నర్మెటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలోని ఉపాధ్యాయులు బాగా పనిచేస్తున్నారని, ఫలితంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్‌కుమార్ ను ముఖ్యమంత్రి పలకరించారు. ప్రధానోపాధ్యాయుని పేరు అడిగి విద్యార్థుల సంఖ్యను ఇంకా పెంచాలని సూచించారు. పిల్లల్ని బాగా చదివించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో చెప్పి విద్యార్థులను ఆశీర్వదించారు. సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, విద్యార్థులతో గ్రూప్ ఫోటో దిగారు.



అమరజీవి లింగం గౌడ్ ఆశయాలను కొనసాగిద్దాం

- తోల్కట్టలో 25వ వర్ధంతి వేడుకలు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 22 : మండల పరిధిలోని తోల్కట్టలో సీపీఐ మాజీ నాయకుడు బానోరి లింగం గౌడ్ 25వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. ప్రభులింగం, కాంగ్రెస్ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం లింగం గౌడ్ చేసిన పోరాటాలు ఆదర్శనీయమని వారు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె. శ్రీనివాస్, నాయకులు సత్తిరెడ్డి, సుధాకర్ గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 22: మండలంలోని అప్జూపూర్ గ్రామానికి చెందిన వల్లభొడ్డు విజయ్ కుమార్ (54) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం నార్సింగిలో కొత్త బట్టలు కొనుగోలు చేసుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇంటికి తిరిగి వస్తుండగా అజీజ్ నగర్ లోని వీఆర్‌కే కాలేజ్ గేటు వద్ద బైకుపై నియంత్రణ కోల్పోయి గేటును ఢీకొని పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య వల్లభొడ్డు కర్పూర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



10 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన పూర్వ విద్యార్థులు

- కందుకూరు బాయ్స్ హై స్కూల్ 2009-10 బ్యాచ్ సమ్మేళనం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి22: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం కందుకూరు బాయ్స్ హై స్కూల్ 200910 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మరోసారి కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయంగా గెట్ టుగెదర్ నిర్వహించారు .2017లో దెబ్బడగూడ బురుజుకోట మైసమ్మ ఆలయం వద్ద మొదటి సమావేశం నిర్వహించగా, 10 ఏళ్ల తర్వాత మళ్లీ అదే స్నేహ బంధంతో ఈరోజు సమావేశమయ్యారు .ఈ కార్యక్రమంలో స్నేహితులు ఒక్కరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ,తమ జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. స్కూల్ రోజుల సరదా సంఘటనలు,గురువుల జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ అందరూ భావోద్వేగానికి లోనయ్యారు.ఇలాంటి సమావేశాలు స్నేహాన్ని మరింత బలపరుస్తాయని,భవిష్యత్తులో కూడా తరచూ కలుసుకోవాలని నిర్ణయించారు.అదేవిధంగా పరస్పరం సహకారం అందించుకుంటూ,అవసర సమయంలో ఒకరికొకరు తోడుగా ఉండాలని సంకల్పించారు.ఈ గెట్ టుగెదర్‌లో పి.సురేష్, ఎం.శివ కుమార్, కె.రాజశేఖర్, కె.రామకృష్ణ, పి.మహేష్ గౌడ్, ఎం.మహేష్, ఎం.వినోద్, ఎ.సురేష్, కె.గణేష్, జి.శివ, బి.శ్రీను, డి.శివ, ఎ.రమేష్, కె.సురేష్, ఎన్. బాలకృష్ణ, ఎన్.గిరీష్, ఎన్.శ్రీకాంత్, జి.నవీన్,కుమార్, వి.భాస్కర్, పి.శాంసన్, ఎం.శేఖర్ రెడ్డి, సుజన్, ఎ.రాజు, శ్రీశైలం, డి.దుర్గప్రసాద్, టి.నరేందర్, జి.మల్లేష్, బి.నిరంజన్, కె.శ్రీకాంత్, డి.రామకృష్ణ, కె.అరవింద్, డి.గణేష్, బి.రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

- బడ్జెట్లో బీసీలపై వివక్షత చూపించి అవమానించారు
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కారు
- సరిదిద్దక పోతే అసెంబ్లీ ముట్టడిస్తాం
- బీసీ సంఘాలు, అఖిలపక్ష నేతల హెచ్చరిక



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 22: అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను నమ్మించి గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై అన్ని రంగాలలో వివక్షత చూపిస్తూ నయవంచనకు గురి చేస్తుందని బిసి సంఘాల నేతలు, అఖిలపక్ష పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ బీసీల వాటా అంశంపై సమావేశం జరిగింది బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు జీ ఆనంద్ గౌడ్, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ లు పాల్గొని మాట్లాడారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత రెండు బడ్జెట్లలో అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఈసారి ప్రవేశపెట్టిన మూడవ బడ్జెట్ లో కూడా అన్యాయం జరిగిందన్నారు. బీసీల సంక్షేమానికి 20 వేల కోట్లు కేటాయించాలని, చట్టబద్ధమైన బీసీ సబ్ తీసుకురావాలని, బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించడం కోసం పదివేల కోట్లు బడ్జెట్లో కేటాయించాలని తాము డిమాండ్ చేస్తూనే వస్తున్నామని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చెవిటి వారి ముందు శంఖం ఊదిన చందంగా వ్యవహరించిందని ఆయన అన్నారు. బీసీలకు బడ్జెట్లో బిక్షంగా కాకుండా, ఒక హక్కుగా దక్కాలంటే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావడానికి తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీల బడ్జెట్ తగ్గించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అవమానించిందని, అప్పుల్లో బీసీలకు రెండు లక్షల కోట్లకు పైగా కేటాయింపులు రుద్ది, సంపదలో కేవలం 9000 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం సిగ్గుచేటు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు 70 వేల కోట్లు దోచిపెట్టిన ప్రభుత్వం బడుగు విద్యార్థులకు 7500 కోట్లు ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగ గౌడ్, బీసీ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఇరాన్‌పై యుద్ధాన్ని కొనసాగించేందుకు అమెరికా వద్ద కావాల్సినంత డబ్బు ఉంది. ట్రంప్ తన అధికార పరిధిలోనే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. యుద్ధం కోసం అదనంగా కేటాయిస్తున్న నిధులు కేవలం ఎక్స్‌ట్రా మాత్రమే. అసలు పోరాటానికి సరిపడా డబ్బు ఇప్పటికే ఉంది. ఇరాన్ విషయంలో ప్రస్తుతానికి అన్ని ఆప్షన్లు రెడీగా ఉన్నాయి.
- యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్

బహుళ


పుస్తక పరిచయం

ఆలోచనలో మార్పు.. విజయానికి తొలి మలుపు...



కత్తుల లక్ష్మారెడ్డి
94401 26566

మన ఆలోచనలు మన జీవితాన్ని నిర్దేశిస్తాయి. మనుషుల జీవితానికి పరిస్థితులు ఒక వేదికను అందిస్తాయి. ఆ వేదికను ఎలా వినియోగించుకోవాలో నిర్ణయించేది వారి ఆలోచనలే. మంచి ఆలోచన మనిషి జీవన దిశను పూర్తిగా మారుస్తుంది. మంచి ఆలోచన మనిషి జీవితాన్ని తీర్చిదిద్దుతుంది. చెడు ఆలోచనలు మనుషుల ప్రయత్నాలను అడ్డంకిగా మారి అవకాశాలను దూరం చేస్తాయి. అందుకే ఆలోచనలు మనుషుల వ్యక్తిత్వానికి, ప్రవర్తనకు, భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలుస్తాయి. వ్యక్తుల ఆలోచనలకు అనుగుణంగా వారి జీవితం రూపుదిద్దుకునేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లక్ష్యాలపై అయోమయం, సమయాన్ని సరిగ్గా వినియోగించుకోక పోవడం, ఆత్మవిశ్వాసం లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల లక్ష్యంపై దృష్టినిలుపక పోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో డా. మహ్మద్ హసేన రచించిన "మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి" అనే పుస్తకం మార్గదర్శిగా నిలుస్తుంది. ఈ పుస్తకం ప్రధానంగా యువతను దృష్టిలో పెట్టుకుని రాసినప్పటికీ, జీవిత దిశను మార్చుకోవాలని అనుకునే ప్రతి పాఠకుడికి ఇది ఉపయోగపడే గ్రంథంగా నిలుస్తుంది. ఆలోచనల్లో వచ్చే చిన్న మార్పు జీవిత గమనాన్ని మారుస్తుందనే నమ్మకాన్ని ఈ గ్రంథం బలంగా కల్పిస్తుంది. ఈ పుస్తకం కేవలం ప్రేరణ కల్గించే సందేశాల సమాహారం మాత్రమే కాదు. పాఠకుడిని తనలోకి తీసుకెళ్లే ఒక ఆత్మ పరిశీలన ప్రయాణం. ప్రతి మనిషి తనను తాను ప్రశ్నించుకుని, సానుకూల వైఖరిని అలవర్చుకునేందుకు వ్యక్తిత్వ వికాస కథలతో రచయిత సరళమైన భాషలో వివరించారు. వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయ నిర్వహణ, లక్ష్య సాధన, జీవన విలువలు, కెరీర్ దిశ వంటి అంశాలను స్పష్టంగా వివరించడం ద్వారా పాఠకుడి ఆలోచనల్లో స్పష్టమైన మార్పు పెంపొందించేలా ఈ గ్రంథం రూపుదిద్దుకుంది. చదువుతున్న కొద్దీ పాఠకుడికి తన జీవితంపై కొత్త అవగాహన పెరుగుతుంది. తాను ఏం చేయాలి, ఎలా ముందుకు సాగాలి అనే ప్రశ్నలకు సమాధానాలు కనబడతాయి. పుస్తకంలో ఏడు అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం ఒక ప్రత్యేక భావన చుట్టూ తిరుగుతుంది. చిన్న కథలతో పాఠకుడిని ఆత్మ పరిశీలన నుంచి ఆత్మ వికాసం వైపు నడిపిస్తుంది. రచయిత ప్రతీ అంశాన్ని చిన్న చిన్న ఉదాహరణలు, అనుభవాలు, ఆలోచింపజేసే వ్యాఖ్యలతో వివరించారు. ప్రతి అంశాన్ని వ్యక్తిత్వ వికాస కథలతో చెప్పడం గ్రంథానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొదటి అధ్యాయం వ్యక్తిలోని విలువలను గుర్తించడం ద్వారా ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవాలని ప్రేరణ కలిగిస్తుంది. మనసులో అనవసర ఆలోచనలను నింపుకోవడం ప్రమాదకరమని గుర్తు చేస్తుంది. విలువైన మనిషి మెదడును చెత్తబుట్టలా ఉపయోగించకుండా సానుకూల ఆలోచనలతో నింపితే జీవితానికి సార్ధకత లభిస్తుందని రచయిత చెబుతారు. భయం, ఆత్మవిశ్వాసం, వైఫల్యం వంటి జీవన సత్యాలను రెండవ అధ్యాయం విశ్లేషిస్తుంది. చాలా మంది తమ సామర్థ్యాన్ని గుర్తించక భయంతో వెనుకడుగు వేస్తారని రచయిత సూచిస్తారు. మనసులో పుట్టే ఒక భావన భయం. భయాన్ని ధైర్యంగా ఎదుర్కొంటే అదే విజయానికి మొదటి మెట్టుగా మారుతుందని రచయిత ఉదాహరణలతో వివరించారు. ఆత్మవిశ్వాసం మనిషిని ముందుకు నడిపిస్తే, అహంకారం అతన్ని ఒంటరిని చేస్తుందని, మనిషి పతనానికి అహంకారం కారణమవుతుందని ఈ అధ్యాయం స్పష్టంగా తెలియజేస్తుంది. జీవిత ప్రయాణంలో అవరోధాలు, కష్టాలు, శ్రమ ప్రాముఖ్యతను మూడవ అధ్యాయం చర్చిస్తుంది. జీవితంలో ఎదురయ్యే కష్టాలను విజయాలకు మెట్లుగా మార్చుకునే వారు విజేతలుగా నిలుస్తారని పాఠకుడికి ప్రేరణ కల్గిస్తుంది. జీవన విలువలు, స్నేహం, కుటుంబ బంధాలు, లక్ష్యసాధన వంటి అంశాలను నాలుగు, అయిదు అధ్యాయాల్లో స్పృశించారు. అహంకారం మనిషిని ఒంటరిని చేస్తుందని, వినయం అతన్ని మరింత ఉన్నతంగా నిలబెడుతుందని ఈ భాగం గుర్తుచేస్తుంది. సమయపాలన, సానుకూల ఆలోచనల ప్రభావం, కష్టపడి పనిచేయాల్సిన అవసరాన్ని ఆరవ అధ్యాయంలో చర్చించారు. సమయాన్ని విలువైన వనరుగా భావించి క్రమబద్ధంగా వినియోగిస్తే లక్ష్యాలను చేరుకోవచ్చని ఈ అధ్యాయంలో తెలియజేశారు. సంపాదనలో తెలివి తేటలతో పాటు నైతిక విలువలు కూడా అవసరమని రచయిత నొక్కిచెప్పారు. యువత సమగ్ర కెరీర్ కు చివరి అధ్యాయం మార్గదర్శకంగా నిలుస్తుంది. పరీక్షలపై అవగాహన, ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యే విధానం, సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత, పదవ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉన్న అవకాశాలపై స్పష్టమైన వివరాలు అందించడం ఈ అధ్యాయం ప్రత్యేకత. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కెరీర్ ఎంపికలో స్పష్టత ఎంత ముఖ్యమో రచయిత వివరించారు. ఈ అధ్యాయం ఒక "కెరీర్ హ్యాండ్ బుక్"లా ఉపయోగ పడుతుంది. కానీ మొత్తంగా "మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి" అనే ఈ గ్రంథం పాఠకుడిని కేవలం చదవమని కాదు. ఆలోచించమని ఆహ్వానిస్తుంది. వ్యక్తిత్వ వికాసం, మానసిక బలం, విలువల పరిరక్షణ, కెరీర్ స్పష్టత అనే నాలుగు స్థంభాల మీద నిర్మితమైన గ్రంథం యువతకు ఒక దిక్సూచి. చదివే ప్రతి వ్యక్తిలో ఒక కొత్త ఆలోచనను రగిలించే శక్తి ఈ పుస్తకానికి ఉంది. జీవితంలో గమ్యం కోసం వెతుకుతున్న ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఒక ఆలోచనల దీపంలా మార్గం చూపుతుంది. ఇది చదివి ముగించే పుస్తకం కాదు. చదివిన తర్వాత మనలో మార్పు తీసుకొచ్చే పుస్తకం. ఆలోచనల్లో చిన్న వెలుగు వెలిగితే జీవితం కొత్త దిశలో సాగుతుంది అనే సత్యాన్ని ఈ గ్రంథం స్పష్టంగా తెలియజేస్తుంది.



పుస్తకం పేరు:
మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి
రచన: డా|| మహ్మద్ హసేన
పేజీలు: 278. **వేల:** 299/-
ప్రతులకు: 9908059234

కవితలు

జలం-జీవన జ్యోతి

నిశీధిలోనూ వినిపించే నిశ్శబ్ద గానం..
అది జలధారల మృదుస్పర్శ;
చుక్కగా పడి నేలను తాకే వేళ,
భూమి హృదయం హర్షంతో కొట్టుకుంటుంది।

అదృశ్యంగా సాగిపోతున్న ప్రతి చుక్కలో,
అనంతకాలపు ఆశలు దాగి ఉంటాయి;
దాన్ని అర్థం చేసుకున్న మనసే మహోన్నతం,
దాన్ని వృధా చేసిన వేళ కాలమే ప్రశ్నిస్తుంది।

వెలుగు చూడని విత్తనాలకైనా జీవం ఇచ్చేది,
నిశ్శబ్దంగా జారే నీటి కరుణ;
ఆ కరుణను కాపాడే చేతులే,
భవిష్యత్తు వేదికను నిర్మించే శిల్పులు।
ఎండిన నేలపై పగుళ్లు పడిన వేళ,
ఆర్తనాదం వినిపించేది ప్రకృతిదే;
ఆ స్వరం అర్థం చేసుకున్న మనిషి,
జలాన్ని దేవతగా భావించి కాపాడతాడు।

ఇంటి తలుపు దగ్గర జారే ఒక చుక్కనుంచి,
ప్రపంచపు ప్రవాహాల వరకూ...
సంరక్షణ అనే ఒక చిన్న నిర్ణయం,
విశాలమైన మార్పుకు మార్గదర్శకం అవుతుంది।

జలమే కాదు... మనసాక్షి కూడా అదే,
దాన్ని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడటం;
చుక్కను దాచిన వేళ చరిత్ర నిలుస్తుంది.

ప్రకృతికి మనం ఇచ్చే అతి పెద్ద కానుక 'నీటి సంరక్షణ
నీటిని ప్రతి ఒక్కరూ ఆదా చేయాలని కోరుకుంటూ...



మంజుల పత్తిపాటి
9347042218
యాదాద్రి భువనగిరి జిల్లా

నా భారతదేశం గొప్పది

నా భారతీయ సంస్కృతి,
విశ్వ ప్రఖ్యాతి
నా భారతదేశం
గొప్పది
కులంతో కుళ్ళుతోంది,
మతంతో మదమెక్కి మండుతోంది
మసిపూసి గ్యారడి చేస్తున్నది.
ఆహా
నా భారతదేశం గొప్పది.
మంత్రాలు ,తంత్రాలు , అందత్వ
మూఢాచారాల మూడత్వంతో
ముందుకు సాగుతోంది.
ఓ ఓ
నా భారతదేశం గొప్పది
అమ్మాయిలు ,మహిళల పైన
అఘాయిత్యాలు ,అత్యాచారాలు,
యాసిడ్ దాడులు చేస్తున్నది,
చేయిస్తున్నది
ఊరికే చూస్తున్నది.
ఆహా ఓ ఓ
నా భారతదేశం గొప్పది
పేదోడిని లేనోడిని లేనట్టుగా
పాతాళానికి తొక్కేస్తున్నది
ఉన్నోడిని అందలం ఎక్కిస్తున్నది.
నా భారతదేశం చాలా
గొప్పది
కులం పేరుతో , మతం పేరుతో,
ప్రాంతం పేరుతో, భాష పేరుతో,
యాస పేరుతో వేరు చేసి
రాజకీయం చేస్తూ
గద్దెనెక్కిపాలిస్తున్నది
మనమంతా భారతీయులమని
మరిచిపోతున్నది
ఓ భారతీయ ఓ....భారతీయ
నువ్వన్నది నిజం
నువ్వు మనిషివి అన్నది ఇంకా నిజం
ఇది ఎప్పుడో మరిచింది
సభ్య సమాజం
మనకద్దు ఈ కులతత్వం,
ఈ మతతత్వం
అరె చల్
మనకుండాలిసింది
మానవత్వం
ఇది నా అభిమతం
నీ పయనం, నీ గమ్యం
ప్రజాస్వామ్యం
ఇది నిజం
ఇది నిజం
ఇదే నిజం



మండల గణేశ్ .
బద్దిపడగ, సిద్దిపేట జిల్లా

ఆకుపచ్చగడ్డి శిలుక

గలగలపారేటి వాగుపొంటి గెలలేసిన
తాటివనాల మండువల నడుమ
ఆకుపచ్చ గడ్డి శిలుకై వసంతం ఆడేది బతుకు
తలుక్కున మెరిసే కనుపాపల్లోని సింగిడిని దూసి
చెరోక్కదిక్కు చిరునవ్వులనువిరజిమ్ముకునేది !
కాలాన్ని నోట కరుసుకోని
మూలాలను దేవులాడేటి
పచ్చి పచ్చి ప్రాణధారే మన దోస్తానా !
దిగులు వూబిలో గిరాగిరా పరిభ్రమించే
మనస్సువొక్క అవిశ్రాంత రెక్కల పురుగు
అవును.. మిత్రమా !
నీవు నేను కలిసి చానా రోజులైతంది!
తనివితీరా మాట్లాడుకొని ఏండ్లాకేడ్లైతంది
శ్రమధర్మ మెరుగని అధ్వానం జీవితంల
ఎవ్వలకు వాళ్ళం తవుసు ఎల్లపోతున్నం
హృదయంతరాల్లో మత్తడి దుంకే దుక్కం
పడావు పడ్డ బీడు భూముల
సర్రు సర్రున అవిరైపోతున్న గొడ్డు కాలం
తల తెగిన వాక్యమొక్కటి
నేలకు తలబాదుకుంటుంది

స్వార్థం ,ఈర్ష్య రెండుమూతుల ఆనకొండై
అటు ఇటు పాకుకుంట
మానవత్వాన్ని అమాంతం మింగే
ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్

ఇప్పుడు ...
నీకునువ్వే నాకునేనే సిపాయిలం
పక్కపొన్నప్రపంచం కాలిబూడిదైపోతున్న
పట్టించుకోని ఆధునిక మానవులం
పొయ్యిల కొర్రాయి సురుకంటితే గాని
సోయికిరాని వినియోగదారులం
ఒక్క లైక్ ఒక కామెంట్ గా
మారిన సబ్ స్క్రైబర్లం
అంతర్జాల మాయలో బందీలైన జిల్లపురుగులం



డా.పొన్నాల బాలయ్య
9908906248

సందర్భం

ఈస్తటిక్స్ కవితాంతరంగం ఒక కార్యశాల



అన్నవరం దేవేందర్
9440763479

కవితాంతరంగంలో కవుల కలయికనే ఒక సాహిత్య సౌందర్యం. కవి పేరు లేకుండా కవితలన్నీ డీప్ గా చదవడం ఒక సంబరమైన అనుభవం. మనసుకు ఒక బలవర్ధకమైన ఆహారం కూడా. వస్తువు శిల్పం రూపం ఎత్తుగడ నడకల కొలమాన పరికరాలతో కైత్వాలన్నీ బేరీజు వేయడమే రెండు రోజులగ పని. మైండ్ కు బెస్ట్ ఎక్సర్సైజ్ . కవిత్వం ద్వార సామాజిక మాధ్యమాల ద్వారా పేర్లు మాత్రమే తెలిసి పరిచయం లేని కవులు. తరచూ సాహిత్య సభల్లో కలుసుకునే బాగా తెలిసున్న కవులం కొందరిమి. ఈడెబ్బై మంది గుంపుగా మరియు విడివిడిగా ఒక్కో కవితను పట్టి తేజాబులో వేసి తీయడమే ఖమ్మం ఈస్తటిక్స్ నిర్వహించిన కవిత్వ ప్రతిధ్వని. మార్చి 14, 15 2026 తేదీలలో ఖమ్మం వైరా రహదారి పక్కన గల సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఈ కవిత్వ అధ్యయన శాలకు చారిత్రక వేదిక అయింది. చారిత్రక అని ఎందుకు అంటున్నాను అంటే ఇదివరకిట్ల ఎక్కడ జరగని పని అనే భావన.మొత్తం దాదాపు 70 దాకా కవితలు. ఏడు బృందాలు. బృందానికి ఆరుగురు కవులు. ఆరు విడతలుగా అధ్యయనం చేయడం. ఒక్కోసారి 12 కవితలు టేబుల్ పైకి వస్తే ఆరుగురు కవులు ఆ కవితల రూప లావణ్యాలను పరిశీలించి ఒక్క నోట్ తయారు చేసుకుంటారు. ఆ స్టేట్మెంట్ ను అందులో నుంచి ఒకరు వేదికపై ఏడు నిమిషాల్లో ప్రజెంట్ చేస్తారు. ఇలా ప్రతి రౌండ్ కు మరొక్కరు ఆ రౌండ్ లో వచ్చిన కవిత్వ పత్రాలని బృందం అభిప్రాయంగా నిర్మొహమాటంగా చెప్పాలి. అందులో తనది ఉండవచ్చు. ఎవరిదైనా ఉండవచ్చు. టేబుల్ మీదికి వచ్చిన కవితలన్నీ అక్కడ ఉన్న అందరి కవితలు. కానీ నాదని ఏ కవి చెప్పకూడదు. ఈ సస్పెన్స్ భలే ఉంటది. నా కవిత 'ఊరి సొగసు' ను ఇది ప్రకృతి ఆరాధన కవిత అని, వర్ణనాత్మకమైన కవిత అని అనడం మౌనంగా వింటాం. ఇందులో తెలంగాణ పల్లె వాసనలు ఎక్కువగా ఉన్నాయని , విషయం పాతదే అని కామెంట్స్ వస్తుంటాయి . అన్ని గుంపుల్లోకి ఆ కవిత పోతుంది. అక్కడి గుంపు మేస్త్రి తన ప్రసంగంలో ప్రస్తావిస్తాడు. కానీ ఎవరిదని తెలియదు .ఇదో గొప్ప సస్పెన్స్ తలపించే అనుభూతి. గొప్ప వర్క్ షాప్ ఇది. ఉపన్యాసాలు దంచడం మరికొందరు వినడము సాగది. ఇక్కడ బల్లల మీద కూర్చున్న గుంపులు కాకుండా వేదిక పైనా అన్నీ తెలిసిన సూపర్ స్పెషలిస్టులు ఉంటారు. వాళ్లు వినదగ్గ ఆచరించదగ్గ వ్యాఖ్యలు రౌండ్ రౌండ్ కూ చేస్తుంటారు. ఇదంతా రెండు రోజులు అత్యంత ఆసక్తిగా జరిగింది. అయితే ఏ సమావేశాల కైనా సమయమే మోసం చేస్తది. పూర్తిగా చదివి తృప్తిగా చెప్పే సమయం ఉండదు. తొందరగా కానీయండి అని డ్రిల్ మాస్టర్ అంటూ ఉంటారు. అయినను సూక్ష్మంగానైనా అందరూ కవిత్వాన్ని పరిశీలించి ప్రోగ్రెస్ రిపోర్టు చెప్పడం కవులందరం వినడం భలే మజా అనిపించింది. భవిష్యత్తులో సరిపోయే సమయాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించాలి. ఈ కవితలన్నింటినీ అనుకున్న కవులకు ముందే చెప్పి తెప్పించుకున్నవి. వాటినే మేము పరీక్షా నాళికలో వేసి టెస్టులు చేశాము. అప్పటికే వాటిని 'కవితాంతరంగం 2026' కవితా సంకలనం పుస్తకం ముద్రించి దాచి ఉంచారు. ముగింపు సభలో ఆవిష్కరించి అందరి చేతికి జనుము సంచిలో అందించడం మరింత ఆనందం. దానితోపాటు రవి మారుత్ 'కోపోద్రిక్త స్వరం' తాళ్లపల్లి యాకమ్మ కొత్త పుస్తకం 'పిడికిలి' వంశీకృష్ణ 'తంజావూరు కలలు' రిటర్న్ గిఫ్టుగా ఇవ్వడం బాగా నచ్చింది.ఈ వ్యవహార ఆలోచనా దర్శకత్వం అంతా 'ఖమ్మం ఈస్తటిక్స్' అనగా రవి మారుత్ గారు, బెల్లంకొండ ప్రసేన్ అన్న, సీతారాం అన్నల క్రియేటివిటీ. వీరి వెనుకా ముందు మువ్వా శ్రీనివాసరావు, వంశీకృష్ణ, ఫణి మాధవి కన్నోజు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఉందురు. సెడార్ వ్యాలీ స్కూల్ పచ్చని పర్యావరణంతో కూడిన ఖరీదైన ఆవరణ. గంట గంటకు చల్లని నీళ్లు వెచ్చని ఛాయలు బిస్కెట్లు ఉత్సాహ పరుస్తాయి. బ్రేక్ ఫాస్ట్ ,లంచ్ ,డిన్నర్ లు చాలా రుచిగా బాగున్నాయి. మా అందరికీ సర్వ్ చేసిన సిబ్బంది అందరూ ప్రేమగా వడ్డించారు. ఈ కార్యశాలలో అటు శ్రీకాకుళం విశాఖపట్నం ఇటు కరీంనగర్ వరంగల్ కర్నూలు చిత్తూరు దాకా రావలసిన వాళ్లు వచ్చారు .విజయవాడ హైదరాబాద్ ఖమ్మం వాళ్లు ఎలాగూ వచ్చే వాళ్ళు వచ్చారు. అన్నిటికీ మించి ఇదొక మంచి కలివిడి . సెల్ఫీలు చిత్రాల కోసం జెన్ జీ మిలీనియల్స్ తరాలు పోటీలు పడ్డాయి. ఇలాంటి సదస్సులు అన్ని ప్రాంతాల్లో సాహిత్య సంస్థలు ఏర్పాటు చేస్తే బాగుంటది. అప్పుడే సాహిత్యం తనకు తాను చార్జింగ్ చేసుకున్నట్లు ఉంటది.

మస్తు థాంక్యూలు ఖమ్మం ఇస్తటిక్స్యన్స్ కు



కవిత

పరాధీనమైన పరాభవ నామ సంవత్సరం
పరాభవ నామ సంవత్సర పంచాంగ పఠనం
భవిష్యత్తు దర్శన ప్రవచనాలు.
వివిధ రాజకీయ నాయకుల
ఆస్థాన ప్రవాచకులు, వారిని సంతృప్తి పరిచే
భవిష్యత్తు దర్శనాలు చెప్తూతున్నారు
పరాకాష్టకు చేరిన ప్రపంచికరణ సమయం ఇది
ఇప్పుడు ప్రపంచ భవిష్యత్తు తెలిపే పంచాంగం
మన అగ్రరాజ్య ట్రంప్ చేతిలో ఉన్నది
ప్రపంచ పంచాంగ రచయిత ట్రంపే
ప్రవాచకుడు ట్రంపే, ఈ విశ్వ విపనీలో మనం
ఎక్కడ కొనాలో .. ఎప్పుడు కొనాలో .. ఏమి కొనాలో
నిర్ణయించేది ఈ ప్రపంచ పంచాంగ కర్త ట్రంపే
అవును నిజంగా ఇది "పరాభవ నామ "సంవత్సరమే
మన ఎగుమతులకు ఈ విశ్వ ద్వారపాలకుని
సుంకాల శూలాల పోట్లు భరించాల్సిందే
ట్రంప్ చెప్పినవి దిగుమతి చేసుకోవాలి
వాడు చెప్పిన "పన్ను " రేట్లే వేయాలి
మన రైతన్నల "వెన్ను "విరిగిన పరవాలేదు
అవును ఇది నిజంగా "పరాభవ నామ సంవత్సరమే"
పశ్చిమ ఆసియాలో జ్వాలలు రాజేసి
చలి కాపుకుంటున్న పశ్చిమ దేశాలు
పశ్చిమ ఆసియాలో రక్తపాతానికి కారణం ఎవరు?
కార్పొరేట్ చమురు కంపెనీల కబంధహస్తాల్లో
ఆహుతి అవుతున్న మరణాలకు కారణం ఎవరు?
అవును విశ్వమానవాళికి
ఇది "పరాభవ నామ" సంవత్సరమే
ఈ నూతన సంవత్సరాది విశ్వజనులం జాగృతి అయి
మానవాళి మనుగడకే ముప్పు తెస్తున్న
ఈ రక్త పిపాసి ట్రంప్ ను పరాభవం చేసి
గురువులకే గురువునంటున్న
ఈ విష గురు కోరలు పీకేద్దాం
ఇకనుండి మన ఆర్థిక పంచాంగం
మనమే రాసుకుందాం



యాచం నాగభూషణం
మెదక్

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

- మంత్రి దనసరి అనసూయ సీతక్క
- తిరుమలగిరిలో అంతర్జాతీయ జల దినోత్సవం



ప్రతిపక్షం, పరకాల, మార్చి 22: మానవ మనుగడకు నీరు అనేది ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి అనసూయ సీతక్కతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నేడు జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకున్నప్పుడే భావి తరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా నీటిని వృధాచేయడం వల్ల నీటిని కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చెట్లు పెంచని పక్షంలో రానున్న రోజుల్లో గాలిని సైతం కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు సమీపంలోని చెరువులను కాపాడుతూనే అడవులను కాపాడుకోవాలని, సూచించారు. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్ల పై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పంటలకు అధిక రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడంతో క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయని అన్నారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవనానికి మూలాధారమైన పంచభూతాలైన గాలి నీరు నిప్పు ఆకాశము భూమిని ఇంత పరిశుభ్రంగా ఉంచితే మనతోపాటు భవిష్యత్ తరాలకు అంతా మేలు కలుగుతుందన్నారు. రాబోయే తరాలకు పర్యావరణం పంచభూతాలను పరిరక్షించుకోవాల్సిన ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. విలువైన నీరును వృధా చేయవద్దని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుత జిల్లాలోని గ్రామాలకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇచ్చి శుద్ధమైన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధ నీరు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుండి వినియోగించే నీరు గురించి అధికారులు డెమో ప్రదర్శించారు. సమావేశంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



ప్రభుత్వ తార కళాశాలకు విశ్వవిద్యాలయం హోదా కల్పించాలి

- విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని బడ్జెట్ పత్రాలు దగ్ధం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 22 : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దద్దం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొన్న ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి మొండి చేయి చూపిందన్నారు. కొఠారి కమిషన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కనీసం 30% నిధులు కేటాయించాలి కానీ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపించిందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయిస్తానని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో మాత్రం విద్యారంగానికి కేవలంరూ 26,674 (8.22%) మాత్రమే కేటాయించడం వల్ల విద్యారంగాన్ని ఏ విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందని మండిపడ్డారు.ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్ సవరించి ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో 18% నిధులు విద్యారంగానికి ప్రకటిస్తామని చెప్పిన మాట ప్రకారమైన విద్యా రంగానికి కనీసం 18% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న తార ప్రభుత్వ కళాశాలకు విశ్వవిద్యాలయం హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్,నాయకులు రమేష్,రాజు,ప్రవీణ్, కుమార్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 22 : బీజేపీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. నాగులపల్లిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 ఉమ్మడి తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రశిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కుల, మతం, లింగ బేధాలు లేకుండా బీజేపీ పార్టీ దేశ సమగ్రత కు పాటుపడుతుందన్నారు. శిక్షణ పొందిన ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో మెలుగుతూ, ప్రజా సేవే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాజేందర్, శంబీ పూర్ రాజు, జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మునిపాలిటీ అధ్యక్షులు రాంబాబు, ప్రశిక్షణ కోకన్వీనర్లు మరియు వివిధ మోర్చాల పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన

ప్రతిపక్షం, గుండాల, మార్చి 22: ఖమ్మం పట్టణంలో న్యూ డెమోక్రసీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ గుండాల మండలం కాచనపల్లి గ్రామంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.వెలుగుమట్ల భూదాన భూముల విషయంలో జరుగుతున్న అన్యాయం పై ఆందోళన వ్యక్తం చేశారు.ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సమానంగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, కోల లక్ష్మీనారాయణ తదితరులు చేపట్టిన శాంతియుత ఖమ్మం బంద్ సందర్భంగా పోలీసులు వారిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం జరిగింది.అటికం శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పూనెం రంగన్న మాట్లాడుతూ. ఫిబ్రవరి 24న ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల గ్రామంలో గత పది సంవత్సరాలుగా నివసిస్తున్న సుమారు 800 మంది పేదల గుడిసెలను ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కూల్చివేసినట్లు తెలిపారు.అనంతరం జరిగిన పోరాటాల ఫలితంగా కేవలం 300 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు.ఇళ్ల పట్టాల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పూనెం రంగన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని, వెలుగుమట్ల భూదాన భూముల్లో నివాసం కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా సంస్కృతిక సంఘం కార్యదర్శి ఎనగంటి చిరంజీవి, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా నాయకులు ఎనగంటి లాజర్, న్యూ డెమోక్రసీ మండల నాయకులు బొమ్మెర వీరన్న తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 23: హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం తిరుమలగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదివారం సందర్శించి పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పాఠశాలలోని 10వ మరియు 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు ప్రగతిని పరీక్షలకు సన్నద్ధతను గురించి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలని లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కృషి చేయాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం ఇతర నిత్యావసర వస్తువుల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని కూడా పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధికారి వాసవి కలెక్టర్‌కు వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోచమ్మగల్లి ఎస్సీ మాల సంఘం

అధ్యక్షుడిగా తర్ల రాజేష్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 22 : నగరంలోని పోచమ్మగల్లి ఎస్సీ మాల సంఘం అధ్యక్షుడిగా తర్ల రాజేష్ గెలుపు పొందారు. ఆదివారం పోచమ్మగల్లీ సంఘంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి తర్ల రాజేష్, దయాసాగర్ లు పోటీపడగా పోటీపడగా రాజేష్ 113 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా తర్ల రమేష్ గెలుపొందారు. కోశాధికారిగా ఎడ్ల పవన్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహణ ప్రధాన అధికారి నాంది సుశీల్ కుమార్, సహాయ అధికారులు సురేష్, ప్రవీణ్ లు ప్రకటించారు.

ఆర్థిక స్తోమత లేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకాన్ని అందించడం నా బాధ్యత

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 22 : ఆర్థిక ఇబ్బందులు పడుతూ వైద్యం పొందలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా చెక్కులు అందించడం తన బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా చూస్తానన్నారు. దరఖాస్తు విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తన బృందం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను ఖచ్చితంగా సెక్రటేరియట్ కు పంపించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు మొత్తంలో వీలైనంత ఎక్కువగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి అత్యవసర ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందని చెప్పారు. కాగా మొత్తం 85 మందికి రూ.56, 20,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. గడిచిన నాలుగేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నియోజకవర్గంలో ఒకటి కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. నాగారంలో గల 396 ఇండ్లు, కలెక్టరేట్ సమీపంలో మరో 200 ఇండ్లు ఉన్నాయన్నారు. వీటిని నిర్మించి ఏళ్లు గడిచిందని వాటి కిటికీలు, తలుపులు చోరీకి గురవుతున్నాయని, ఈ విషయాన్ని అనేకసార్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి, అసెంబ్లీలో ప్రస్తావించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి, మఠం పవన్, చింతకాయల రాజేందర్, ఇప్పకాయల కిషోర్, దాంపల్లి జ్యోతి మురళి, బొబ్బిలి సుమిత్ర వేణు, కలిపే అర్చన చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, బిజెపి నాయకులు బద్దంకిషన్, పుట్ట వీరేందర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్ రావు కృషి ఫలితమే నేటి పామాయిల్ ఫ్యాక్టరీ


- కాళేశ్వరం జలాలే లేకుంటే నేడు పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ లేదు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ 'వంటేరు'



ప్రతిపక్షం గజ్వేల్, మార్చ్ 22: కేసీఆర్ తల పెట్టిన కాలేశ్వరం జలాల సాకారం మాజీ మంత్రి హరీష్ రావు కృషి ఫలితమే నేడు నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభమైందని గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం నాడు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాలేశ్వరం జలాలతో మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ ల ద్వారా నీరు నేడు పామాయిల్ ఫ్యాక్టరీకి గుండెకాయ లాంటిది అన్నారు. సొమ్ము గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వానిది అయితే సోకు నేడు ప్రారంభించిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలేశ్వరం ప్రాజెక్టు పైన, కెసిఆర్ పైన, అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. నర్మెట్టా లో కల్వకుంట్ల చంద్రశేఖర రావు సహకారం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అహర్నిశలుగా చేసిన కృషి వల్ల 62 ఎకరాలలో దాదాపు 300 కోట్ల రూపాయలతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగిందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆయిల్ ఇండస్ట్రీ వారు సిద్దిపేట ప్రాంతం పామాయిల్ తోటలకు ఆమోదయోగ్యం కాదు అనుకూలమైన వాతావరణం కాదు అని చెప్పిన ,కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా వాతావరణంను అనుకూలంగా మార్చి కాలేశ్వరం అనే ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ కొండ పోచమ్మ సాగర్ రంగనాయక సాగర్, ప్రాజెక్టులను నింపి కాలువల ద్వారా మిషన్ భగీరథ చెరువులను చెక్ డ్యాములను గుంటలను గోదావరి జలాలతో నింపి రైతులకు నీరును అందించి పామాయిల్ పంటలను అసాధ్యం నుండి సుసాధ్యం చేసి పామాయిల్ తోటలను రైతులకు అందుబాటులో తీసుకువచ్చి నేడు తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. కాలేశ్వరం కూలింది అంటున్న రేవంత్ రెడ్డి పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఎలా జరిగిందో తెలుసుకొని, సోయి తెచ్చుకొని, ఆత్మ పరిశీలన చేసుకొని మాట్లాడాలన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు 140 టీఎంసీల నీటిని నిల్వతో అనేక ప్రాజెక్టులను నింపి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని నిర్మించి ఐదు ఉమ్మడి జిల్లాలకు పామాయిల్ రైతులకు అందుబాటులో ఉంచిన ఘనత కేసిఆర్ ది అన్నారు. అబద్ధాల పునాదులు మీద ఏర్పడిన రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు బంధును కూడా అందరికీ ఇవ్వడం లేదని తెలంగాణ రాష్ట్రంలో అప్డేట్ అయిన రైతులందరికీ ప్రతి ఎకరానికి 15వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్ రైతు బంధును కూడా వెంటనే రైతుల ఖాతాల లో పూర్తిస్థాయిలో జమ చేయాలని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అంటూనే రైతుల నట్టేట ముంచుతున్నారని, మద్దతు ధర ఇవ్వకుండా, కొనుగోలు చేయకుండా మొక్కజొన్న రైతులను నడ్డి విరుస్తున్నారని, మొక్కజొన్నలను కొనడం లేదని దళారులకు రైతులు క్వింటాలుకు 1500 చొప్పున అమ్ముకుంటారని, రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాపంగా మారిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ పై, వారి కుటుంబంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి దిగజారుడు మాటలతో తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని మంట కలుపుతున్నారని, హాయ్ అన్న మాటలను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రప్రజలు చాలా చైతన్యవంతులని వారు చేసే అవినీతి,అరాచకాలు అసత్యాలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, వైస్ చైర్మన్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, కౌన్సిలర్లు అత్తిలి శ్రీనివాస్, కోట బాబు, కప్ప మమతా సంతోష్, మాజీ కౌన్సిలర్లు తలకొక్కుల దుర్గాప్రసాద్, ఉప్పల మెట్టయ్య, గుంటుకు రాజు, రహీం, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, అజీజ్ బాలకిషన్, అహ్మద్, ఉమర్, హనుమంత్ రెడ్డి, శివ పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కార్యరూపం ఏది?

- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు 'కొట్టాల'



ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 21: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ప్రశ్నించారు. ఆదివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ పట్టించుకోకపోతుండగా, ప్రతి బడ్జెట్లోనూ బీసీలకు రూ 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పగా, ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు ఇవ్వాల్సిన సీఎం రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండగా, అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ కళాశాలలు, గురుకులాలకు నిధులు ఇవ్వకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బడుగు వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న కాంగ్రెస్ కనీసం బిసి కార్పొరేషన్లకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ విద్యార్థులు, చేతి, కులవృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ నిధులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకు బీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల ఉన్నత చదువులను అడ్డుకోవాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమాజంలో వెనుకబడిన అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించాలని, దీనిపక్షంలో జాగృతి ఆధ్వర్యంలో చైతన్యం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని వివరించారు.



ఇరాన్ ఇస్లామిక్ రెజిమీ సొంతంకాదు. అక్కడి మౌలిక వసతులపై ప్రజలకే హక్కు ఉంది. పాలకులు అభివృద్ధిని అణచివేస్తున్నారు. ఇరాన్‌ను కాపాడేందుకు ప్రస్తుత ప్రభుత్వాన్ని అంతం చేయాలి. పౌరులను మినహాయిస్తూ ఇరాన్ ప్రభుత్వంపై యూఎస్, ఇజ్రాయెల్ దాడులు కొనసాగించాలి.

- ఇరాన్ మాజీ యువరాజు రెజా పహ్లావి

బడ్జెట్‌లో హామీలకు మొండిచేయి!

- బీఆర్ ఎస్ నేత జీడిపల్లి రాంరెడ్డి



ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 22: బడ్జెట్లో మరొక్కసారి తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రిక్త హస్తం చూపించిందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు.. మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలని, 6గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి గద్దె నెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. రైతన్నలకు దగా చేశారని, 15 వేల రైతుభరోసా, రూ.500 పంటల బోగస్, కౌలు రైతులకు, రైతు కూలీలకు రైతు భరోసా దోకా చేశారన్నారు. కెసిఆర్ హయాంలో నిర్మించిన మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్ట్ కు సంబంధించి దుబ్బాక నియోజకవర్గం లో ఉప కాలువల నిర్మాణం కు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మహిళలకు రూ.2500 గ్యారెంటీ, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీల ఊసే లేదన్నారు. విద్యార్థి యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఎగవేతతో పాటు 2 లక్షల ఉద్యోగాలను ఎగవేశారన్నారు..5 లక్షల విద్యాభరోసా కార్డు ఎగవేసారన్నారు. బీసీలకు లక్షకోట్లు, ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ అభయ హస్తం ద్వారా 12 లక్షలు లేనే లేవన్నారు..ఎస్సీ, ఎస్టీలకు 70 శాతం నిధుల కోత విధించారని, మైనారిటీల సంక్షేమానికి మంగళం పాడారని, కార్మికులకు వెన్నుపోటు పొడిచారన్నారు..ఆసరా పింఛన్ ల పెంపు మరిచారన్నారు. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం, ఆటో అన్నలకు 12 వేల సాయం మరిచారన్నారు..అంగన్ వాడీలకు, ఆశావర్కర్లకు జీతం పెంపు పై మోసం చేశారన్నారు.. ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు ధోకా చేశారని, పీఆర్సీ ముచ్చటే లేదని, డీఏల పెంపు ప్రశ్నే లేదని, రిటైర్మెంట్ బెనిఫిట్ల ఊసే లేదని, పాత పెన్షన్ విధానం ప్రస్తావన లేదని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టి, డిక్లరేషన్లకు పాతరేసి, సంక్షేమ పథకాలకు సమాధి కట్టిన మోసకారి కాంగ్రెస్ కు ప్రజలు సమాధి కట్టడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

దోపిడీ లేని సమాజం కోరుకున్న భగత్ సింగ్

- కమ్యూనిస్టులు అధికారంలో ఉంటేనే యుద్ధాలు, సంక్షోభాలు ఉండవు
- విద్య, వైద్యం, ఉపాధి, కూడు, గుడ్డ అందరికీ సోషలిజంలోనే సాధ్యం
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య
- భగత్ సింగ్ వర్ధంతి బైక్ ర్యాలీ ముగింపు సభ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 22 : స్వతంత్ర పోరాట యోధుడు విప్లకారుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా బీరంగూడలో బైక్ ర్యాలీ ముగింపు సభ జరిగినది ఈ సభలో ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య హాజరై ఆయన మాట్లాడారు ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ మార్క్సిస్టుగా మారాడని ఆయన అన్నారు చిన్నతనంలోనే బ్రిటిష్ కు వ్యతిరేకంగా పోరాడు ఉరికంభం ఎక్కిన విప్లవ యోధుడని ఆయన కొనియాడారు కమ్యూనిస్టులు అధికారంలోకి రావాలని అప్పుడే దోపిడీ లేని సమాజం ఉంటుందని ఆయన కోరుకున్నాడు ఆయన ఆశయాల కోసం ఇప్పటి యువతరం పోరాడాలని ఆయన బాటలో నడవాలని ఆయన విజ్ఞప్తి వేశారు కమ్యూనిస్టులు అధికారంలో ఉంటేనే యుద్ధాలు సంక్షోభలు ఉండవని ఆయన అన్నారు కమ్యూనిస్టులు అధికారంలో ఉంటేనే విద్య వైద్యము ప్రజలందరికీ అందుతుందని పేదరికము నిరుద్యోగము ఆత్మహత్యలు ఏమి ఉండవని అందరికీ కోడుగుడ్డ ఉంటుందని ఆయన అన్నారు భగత్ సింగ్ ను ఆర్ఎస్ఎస్ బిజెపి బుట్టలు వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని దీనిని ప్రజలందరూ తిప్పి కొట్టాలని ఆయన అన్నారు భారతదేశ చరిత్ర మొత్తం బిజెపి ఆర్ఎస్ఎస్ వ్యక్తీకరిస్తుందని ఆయన అన్నారు అంబేద్కర్ను గాంధీని ప్రజలు ఎక్కువగా నమ్మే నాయకులను బిజెపి వాళ్లు తమ కలరు వేస్తున్నారని ఆయన అన్నారు భారత దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తుంగలో తొక్కుతున్నారని అన్నారు మోడీ చేతగానితనం వల్లనే దేశంలో గ్యాస్ పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయని ముందుచూపు లేదని ఆయన అన్నారు ఒక్కరోజు ముందు హిజ్రాలు పర్యటన మోడీ చేశారని ఆయన అన్నారు అమెరికన్ సామ్రాజ్యం వాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాణిక్ ,పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, జార్జ్, సురేష్, మూర్తి, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగుల అరెస్టులు అక్రమం

- రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి22: నర్మెటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ సందర్భంగా సిద్దిపేట జిల్లాలో విశ్రాంత ఉద్యోగులను ముందస్తుగా అరెస్టు చేయడం అక్రమమని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ (రేవా) రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి, అష్ట స్టీరింగ్ కమిటీ సభ్యుడు భరత్ సత్యనారాయణ ఆరోపించారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పొన్నమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిల కోసం రెండు సంవత్సరాలుగా అనేక నిరసన కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి తెచ్చారు.





మెదక్‌లో గుర్తు తెలియని మృతదేహాలు

- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 22 : మెదక్ పట్టణ శివారులో గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు మెదక్ పట్టణ సిఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జాంబికుంట వద్ద నాగిని చెరువు సమీపంలో ఒక గుర్తు తెలియని పురుషుడి మృతదేహం గుర్తించబడింది.సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండి, వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాల మధ్యగా అంచనా వేశారు. మృతుడు నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉండగా, పక్కన ఒక బెల్ట్ మరియు తలపై ఎరుపు రంగు తువాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన కారణంగా గుర్తింపు సాధ్యం కాలేదుని కేసు నమోదు చేసుకునే దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మెదక్ పట్టణంలోని చర్చ్ గేట్ సమీపంలో ఒక గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కనుగొనబడింది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, సుమారు 45 నుండి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల, సాధారణ వర్ణం కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. అతను భిక్షాటన చేసే వ్యక్తిలా కనిపిస్తున్నట్లు ప్రాథమికంగా భావించడం జరుగుతుందని మృతదేహాన్ని మెదక్ మోర్చరీకి తరలించగా, ఇప్పటివరకు ఎవరూ ఆ మృతదేహాన్ని గుర్తించడానికి క్లెయిమ్ చేయడానికి ముందుకు రాలేదుని సీఐ తెలిపారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

విద్యా రంగం పట్ల పాలకుల మాటలన్నీ నీటి మూటలే

- ప్రభుత్వ వైఖరి కి నిరసనగా 24న కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- పెద్ద ఎత్తున టీచర్లు పాల్గొనాలని టిపిటిఎఫ్ పిలుపు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 22 : విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని పదే పదే చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఈ బడ్జెట్లో 8.2 శాతం మాత్రమే కేటాయించి ఈ రాష్ట్ర ప్రజలను మళ్లీ ఒకసారి నిరాశ పరిచిందని, ప్రభుత్వ నిరంకుశ వైఖరి ని నిరసిస్తూ ఈ నెల 24న కలెక్టరెట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొంగోటి యాదగిరి, పి. వెంకట్రామి రెడ్డి లు పిలుపునిచ్చారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా విద్యారంగానికి 20 శాతం గానీ, తెలంగాణ విద్యా కమిషన్ సూచించినట్లు 18 శాతం గాని, కనీసం కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా 15 శాతం కూడా బడ్జెట్ లో ప్రకటించక పోవడం వలన ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదని అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్, బ్రేక్ ఫాస్ట్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఇంత తక్కువ బడ్జెట్ల్ కారణంగా పథకాలు ప్రకటనలకే పరిమితం అయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ లాంటివి మాట మాటకు పేర్కొనే ముఖ్యమంత్రి ఇంత తక్కువ బడ్జెట్ లో వాటిని ఏ విధంగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యారంగ కేటాయింపులపై పున:పరిశీలన చేసి మానవ వనరుల అభివృద్ధికి కీలక పాత్ర పోషించే విద్యారంగానికి అధిక బడ్జెట్ కనీసం 15 శాతం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.బడ్జెట్ లో విద్యారంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 24 న జిల్లా కలెక్టరెట్ ఎదుట చేపట్టే ఆందోళన కార్యక్రమం లో ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలునిచ్చారు.



డంప్ యార్డును నివాసాలకు దూరంగా తరలించాలి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 22: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట పదవ వార్డ్ సమీపం లో ఉన్న డంప్ యార్డ్ ను వెంటనే అక్కడనుండి ప్రజల నివాసాలకు దూరంగా మార్చాలని దుబ్బాక బీజేపీ మున్సిపాలిటీ పదవ వార్డు ఇన్చార్జి కాపర బోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన డంప్ యార్డ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంప్ యార్డ్ ప్రజల నివాసాల దగ్గర లో ఉండటం వలన ప్రజలు అనేక రకాల రోగాలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. డంప్ యార్డ్ నుండి వచ్చే దుర్గంధం వలన గాలి కాలుష్యం తో పాటు నీటి కాలుష్యం ఏర్పడి చాలామంది చర్మ వ్యాధుల కు గురై ఆసుపత్రుల పాలవుతున్నట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డంప్ యార్డ్ కు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ బాలికల మోడల్ పాఠశాల ఉన్నందున అక్కడ చదువుకునే విద్యార్థులు అనారోగ్యాల పాలయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాబట్టి ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి డంప్ యార్డ్ ను అక్కడి నుండి ప్రజలు నివసించే ఇండ్ల కు దూరంగా మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి డంప్ యార్డ్ అక్కడి నుండి వేరే స్థలానికి మార్చే వరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



రైతు మహోత్సవానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 22: తొగుట మండల కేంద్రం లోని వెంకట్రావుపేట నుండి సిద్దిపేట జిల్లా నర్మెట్ట లో జరుగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్,మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సంతోష్, ప్రవీణ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది రాజు,వార్డ్ సభ్యులు భాను,మాజీ సర్పంచ్ పాత్కుల లీలాదేవి వెంకటేశం,నాయకులు ఆంజనేయులు,రాజు,నరేష్,రవీందర్,నర్సింలు, స్వామి,భాస్కర్, నాగరాజు,స్వామి,ఆంజనేయులు, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.



రిటైర్ ఉద్యోగులను నిర్బంధించడాన్ని ఖండిస్తున్నాం: టిపిటిఎఫ్


ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 22: సిద్దిపేట జిల్లా నర్మెటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యం లో రిటైర్ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం నాయకులు పొన్నమల రాములు,పోలీస్ రాజు లను, కొంతమంది విద్యార్థి సంఘ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని వారిని వెంటనే విడుదల చేయాలని టి పి టి ఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ప్రభుత్వం రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మార్చి 2024 నుండి 9వేల కోట్ల పైగా చెల్లించాల్సి ఉండగా వాటిని ఇప్పటివరకు చెల్లించకపోవడం విచారకరం అన్నారు.పెండింగ్ బిల్లులు ,బకాయిలు చెల్లించాలని ఉద్యమం చేస్తే అరెస్టు చేయడం సోచనీయం అని వెంటనే వారిని విడుదల చేసి ,పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని టి పి టి ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నామన్నారు.

సమస్యలకు నిలయాలు డబుల్ బెడ్రూం ఇండ్లు

- ఖాళీగా ఉన్న ఇండ్లు పేదలకు కేటాయించకుంటే ఆక్రమించుకుంటాం
- 24 న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 22 :- జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ సమస్యలకు నిలయంగా మారిందని సమస్యల పరిష్కారం కోసం మార్చి 24 న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య తెలిపారు.మార్చి 1 నుండి 24 వరకు స్థానిక సమస్యలపై జరుగుతున్న క్యాంపెయిన్లో భాగంగా సిపిఎం మెదక్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు సిపిఎం ప్రతినిధి బృందం పిల్లికొట్టల్లోని డబుల్ బెడ్ రూమ్స్ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య మాట్లాడుతూ. జిల్లా కేంద్రంలోని డబ్బులు బెడ్ రూమ్ సమస్యలకు నిలయంగా మారిందని.కాలనీలో 1060 మంది పేదలు నివాసముంటున్నారని తెలిపారు.4 ఏండ్ల క్రితం ఇండ్లు కేటాయించినప్పటికి మౌళిక సౌకర్యాలు కల్పించడానికి అధికారులు ఎందుకు ఆలోచించడం లేదని అన్నారు. సమస్యల నడుమప్రజలు నివాసం ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేదన్నారు. సీసీ రోడ్స్ సౌకర్యం లేనందుకు వర్ష కాలంలో తీవ్ర ఇబ్బంది పెడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇండ్ల మధ్యల ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పేరిగిపోయినయని, రాత్రి సమయాల్లో ఛీడపురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని తెలిపారు.మంచినీటి కొరత తీవ్రంగా ఉందని అన్నారు.20 నిముషాలు మాత్రమే మంచినీళ్లు సరఫరా చేస్తున్నారని అన్నారు. మంచినీటి సౌకర్యం కోసం వేసిన బోర్ చెడిపోయి సంవత్సరం అవుతున్న రిపేర్ చేయించలేదని అన్నారు.56వ బ్లాక్లో మంచినీటి సరఫరా లేదని అన్నారు. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్స్ నాసిరకంగా ఉన్నాయని, పెచ్చులు ఉడిపోతున్నాయని తెలిపారు. అనేక ఇండ్లు వర్షానికి స్లాబ్స్ నుండి నీళ్లు కారుతున్నాయని తెలిపారు.4 ట్రాన్స్ఫార్మర్స్ ఉన్నాయని వాటి చుట్టూ కంచెలు నిర్మించకపోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు.డబుల్ బెడ్ రూమ్స్ కాలనిలోని సమస్యలపై అధికారులకు పిర్యాదు చేసిన ఎందుకకు పట్టించుకోవడం లేదని అన్నారు.డబుల్ బెడ్ రూమ్స్ కాలనీలో పార్క్స్ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.కాలనీలో ప్రత్యేకంగా సాయూహిక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్స్ మంజూరు అయినా వారికీ ఇప్పటి వరకు ఎందుకు ఇండ్లు కేటాయించలేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్స్ కాలనీ అభివృద్ధి కోసం మునిపాలిటీ నిధుల నుండి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కోసం మార్చి 24 న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.సిపిఎం జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్స్ కాలనీ అభివృద్ధి పట్ల మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి లేదన్నారు. రోడ్స్ కనీసం క్లిన్ చేయడం లేదని, రోడ్లపై చెత్త పేరుకుపోతున్న మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని అన్నారు.వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చిమొక్కలు పేరిగిపోయినయని వాటిని ఎందుకు తొలగించడం లేదని అన్నారు. కాలానిలో అనేక మంది అసంఘటితకార్మికులు నివాసం ఉంటున్నారని అన్నారు. అనేక బ్లాక్స్ నిర్మాణం దశలోనే ఉన్నాయని వాటి నిర్మాణం పూర్తి చేసి పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మెదక్ పట్టణ కమిటీ కన్వీనర్ జె సంతోష్ కుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అజయ్ కుమార్, సిపిఎం నాయకులు షౌకత్, వెంకట్, యాదగిరి డబుల్ బెడ్ రూమ్స్ కాలనీ వాసులు మహమ్మద్ ఆఫ్జల్,మహబూబ్ ఖాన్, మంగ్లీ,హైదర్, యాదగిరి పాల్గొన్నారు.




దేశంలో పీపీపీ విధానంలో చేపట్టిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రోడ్డు, ఎయిర్ పోర్టులు విజయవంతం అయ్యాయి. క్వాంటం, ఏఐ, డ్రోన్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీలతో రాష్ట్రంలో సుపరిపాలన అందించేలా ప్రణాళికలు రచిస్తున్నాం. వివిధ దేశాల్లో వయోవృద్ధుల సంఖ్య పెరుగుతోంది. భారత్‌లో ఫర్టిలిటీ రేటు పెరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.
- ఏపీ సీఎం చంద్రబాబు



భారత్ చేరుకున్న మరో ఎల్పీజీ నౌక

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 21: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ మరో ఎల్పీజీ నౌక భారత్‌కు చేరుకుంది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం, నెదర్లాండ్ పోర్ట్ నుంచి పైక్సిస్ పయనీర్ అనే భారీ ఎల్పీజీ నౌక కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరుకుంది. ఈ నౌక సుమారు 16,714 టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్‌ను మోసుకొచ్చింది. 'ఏజిస్ లాజిస్టిక్స్ లిమిటెడ్' కోసం దీన్ని దిగుమతి చేసుకున్నారు. ఫిబ్రవరి 14న అమెరికా నుంచి బయలుదేరిన ఈ నౌక, సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ తెల్లవారుజామున మంగళూరు తీరానికి చేరుకుంది. గల్ఫ్ దేశాల నుంచి ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, అమెరికా వంటి దేశాల నుంచి అందుతున్న ఈ సరఫరా భారత్‌కు ఎంతో కీలకం కానుంది. రాబోయే వారంలో మరిన్ని నౌకల ద్వారా న్యూ మంగళూరు పోర్ట్ మొత్తం 72,700 టన్నుల ఎల్పీజీని అందుకోనుంది. ఇక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు వంటగ్యాస్ సరఫరా చేయనున్నారు. మరోవైపు, కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. మార్చి 14 నుంచి 31 వరకు క్రూడ్ ఆయిల్, ఎల్పీజీ సరుకు రవాణాకు సంబంధించిన ఛార్జీలను న్యూ మంగళూరు పోర్ట్ మాఫీ చేసినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా మాట్లాడారు. దేశంలోని ఏ పోర్టులోనూ రద్దీ లేదని స్పష్టం చేశారు. సరుకు రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.

విశ్వ వీక్షణం



మాపై అమెరికా దాడిచేస్తే మేం భారత్‌పై దాడిచేస్తాం..

- పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ దురుసు వ్యాఖ్యలు

పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ తన నోటి దురుసును ప్రదర్శించారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడిచేస్తే అందుకు ప్రతీకారంగా తాము భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ, ముంబై నగరాలపై తాము బాంబు దాడులకు దిగుతామని బాసిత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న బాసిత్.. అమెరికా తమపై దాడిచేస్తే, తాము వెంటనే భారత్‌పై దాడి చేస్తామని, ముంబై, ఢిల్లీలను వదిలిపెట్టమని అన్నారు. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దామని తలబిరుసు వ్యాఖ్యలు చేశారు. తమ దేశ అణు సంపదను లక్ష్యంగా చేసుకున్నా ఇదే తరహా ప్రతిస్పందన ఉంటుందని అబ్దుల్ బాసిత్ అన్నారు. అయితే ఇది దాదాపు అసాధ్యమైన సందర్భమని అంగీకరిస్తూనే, దీనిని 'వ్యూహాత్మక ఉన్మాదం'గా అభివర్ణించడం గమనార్హం. 2014 నుంచి 2017 వరకు భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా పనిచేసిన బాసిత్ నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్.. ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు ఎదుర్కొంటోంది. ఈ సమయంలో భారత్‌ను అనవసరంగా వివాదంలోకి లాగుతూ బాసిత్ మాట్లాడటంపై భారతీయులు మండిపడుతున్నారు. పాకిస్థాన్ అధికారులకు తమ సమస్యలను పక్కనపెట్టి భారత్‌ను బెదిరించడం అలవాటుగా మారిందని నెటిజన్‌లు విమర్శిస్తున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు.



జీవితం: దేవుడు వడ్డించిన విందా? మనం వండుకోవాల్సిన విందా?



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మానవ పరిణామ క్రమంలో వెలుగు చూసిన అత్యంత సంక్లిష్టమైన ప్రశ్న ఒకటి ఉంది. మన జీవితాన్ని శాసించేది మన శ్రమా? లేక అదృశ్య దైవ శక్తియా? ఈ ప్రశ్న చుట్టూనే వేల ఏళ్లుగా తత్వశాస్త్రాలు, మతాలు మరియు ఆధునిక విజ్ఞాన శాస్త్రం తిరుగుతున్నాయి. ఆధ్యాత్మికత మరియు ఆచరణాత్మకత మధ్య సరైన సమతుల్యత ఏమిటి? దేవుడిపై విశ్వాసం ఉంచడం అంటే మన స్వంత సామర్థ్యాలను విస్మరించడమా? లేక అది జీవితంలో ఎదురయ్యే తుఫానులను తట్టుకోవడానికి ఒక బలమైన పునాదా? మన సమాజంలో రెండు రకాల ధోరణులు కనిపిస్తాయి. మొదటి వర్గం వారు అంతా దైవ నిర్ణయం, మనం చేసేది ఏముంది? అని చేతులు కట్టుకుని కూర్చుంటారు. ఇది అకర్మణ్యతకు (Passivity) దారితీస్తుంది. రెండవ వర్గం వారు నేను కష్టపడితేనే అంతా జరుగుతుంది, దేవుడు అనేవాడు ఒక భ్రమ అని కేవలం భౌతికవాదాన్ని నమ్ముతారు. ఇది అహంకారానికి (Ego) దారితీస్తుంది. కానీ జీవితం అనేది ఈ రెండు తీవ్రతల (Extremes) మధ్య ఉండే ఒక అందమైన సమతుల్యత. పురాతన భారతీయ తత్వశాస్త్రం ప్రకారం, కర్మ మరియు భక్తి అనేవి విడదీయలేనివి. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశిస్తూ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన అని చెప్పాడు. అంటే, పని చేయడంపైనే నీకు అధికారం ఉంది, ఫలితంపై కాదు. ఇక్కడ పని చేయవద్దు అని చెప్పలేదు, కానీ ఫలితం పట్ల ఉన్న ఆందోళనను దైవానికి వదిలేయమని చెప్పాడు. ఇది బద్ధకానికి లైసెన్స్ కాదు, ఒత్తిడి లేని పనితీరుకు మార్గదర్శకం. దేవుడిపై ఆధారపడటం (Reliance on God) అంటే బాధ్యతల నుండి పారిపోవడం కాదు. నిజానికి, అది మనం చేయగలిగిన అత్యుత్తమ ప్రయత్నం చేసిన తర్వాత వచ్చే ఒక ప్రశాంత స్థితి. ఒక ఉదాహరణ చూద్దాం.ఒక రైతు పొలాన్ని దున్నుతాడు, నాణ్యమైన విత్తనాలు వేస్తాడు, కలుపు తీస్తాడు, ఎరువులు వేస్తాడు. ఇదంతా అతని ఆచరణాత్మకత లేదా శ్రమ . కానీ, సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ఉండాలన్నా అతని చేతుల్లో ఏమీ లేదు. అక్కడ అతను దైవ చిత్తం లేదా ప్రకృతి సహకారం పై ఆధారపడతాడు. శ్రమ లేని ప్రార్థన ఫలితాన్ని ఇవ్వదు, ప్రార్థన లేని శ్రమలో తృప్తి ఉండదు. హైదరాబాద్కు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ రమేష్ మాటల్లో నేను మూడు ఏళ్లు నిరంతరం కోడింగ్ నేర్చుకున్నాను. వందల ఇంటర్వ్యూలు ఇచ్చాను. ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా ఉండటానికి నాకు దేవుడిపై ఉన్న నమ్మకం తోడ్పడింది. ఇంటర్వ్యూకి వెళ్లేముందు మా అమ్మ ఇచ్చే ఆశీర్వాదం నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపేది. నా నైపుణ్యం (Skill) బాడీ అయితే, నా నమ్మకం (Faith) దానికి ప్రాణం లాంటిది. చాలా మంది తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి దేవుడిని ఒక సాకుగా వాడుకుంటారు. పరీక్ష సరిగ్గా రాయకుండా దేవుడు తలిస్తే పాస్ అవుతాను అనడం విశ్వాసం కాదు, అది తెలివితక్కువతనం. నిజమైన విశ్వాసం అంటే దేవుడు మనకు మేధస్సును, ఆరోగ్యాన్ని, కాలాన్ని ఇచ్చాడని గుర్తించి, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం. విజయవాడకు చెందిన ఒక చిన్న వ్యాపారి శ్రీదేవి కథ ఇందుకు నిదర్శనం. ఆమె తన వ్యాపారాన్ని ప్రారంభించినప్పుడు దేవుడు ఉన్నాడు చూసుకుంటాడు అని కూర్చోలేదు. ప్రతిరోజూ తెల్లవారుజామునే లేచి మార్కెట్ ట్రెండ్స్ గమనించేది. కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకునేది. ఆమె అంటుంది. దేవుడు మనకు కాళ్లు ఇచ్చాడు నడవడానికి, కానీ దారిలో ముళ్లు ఉంటే చూసుకుని నడవాల్సింది. మనమే. ఆయన శక్తిని ఇస్తాడు, కానీ ఆ శక్తిని పనిలోకి మార్చాల్సింది మనం. ఆధునిక మనస్తత్వశాస్త్రం (Modern Psychology) విశ్వాసాన్ని ఒక కోపింగ్ మెకానిజం (Coping Mechanism) గా చూస్తుంది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా వంటి సంస్థల పరిశోధనల ప్రకారం, ఏదో ఒక ఉన్నత శక్తిపై నమ్మకం ఉన్నవారిలో కార్టిసాల్ (స్ట్రెస్ హార్మోన్) స్థాయిలు తక్కువగా ఉంటున్నాయి. మన మెదడులోని లోకస్ ఆఫ్ కంట్రోల్ (Locus of Control) సిద్ధాంతం ప్రకారం నా జీవితం నా చేతుల్లోనే ఉంది అని నమ్మడం. (శ్రమ బాహ్య శక్తులు నన్ను నడిపిస్తున్నాయి అని నమ్మడం. (విశ్వాసం) విజేతలు ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటారు. నేను చేయగలిగినది నేను చేస్తాను (Internal), నా పరిధిలో లేని అంశాలను దైవానికి వదిలేస్తాను (External) అనే ధోరణి మనిషిని మానసిక రోగి కాకుండా కాపాడుతుంది. జీవితం దేవుడు వడ్డించిన విందు అనే మాటలో గొప్ప అర్థం ఉంది. కానీ విందు వడ్డించినంత మాత్రాన మన కడుపు నిండదు. ఆ పదార్థాలను మనమే చేత్తో తీసుకుని తినాలి. దేవుడు మనకు జీవితం అనే ముడి పదార్థాలను (Raw Materials) ఇచ్చాడు. శరీరం పనిముట్టు, మనస్సు దిక్సూచి, బుద్ధి విశ్లేషణా యంత్రం ఈ ముడి పదార్థాలను ఉపయోగించి మన జీవితాన్ని ఒక అద్భుతమైన వంటకంగా మార్చుకోవాల్సిన బాధ్యత మనదే. గుంటూరుకు చెందిన సుజాత అనే టీచర్ చెప్పినట్లు, దేవుడు నాకు స్కాలర్‌షిప్ రూపంలో అవకాశం ఇచ్చాడు, కానీ అర్ధరాత్రి దాకా మేల్కొని చదివి ఆ అవకాశాన్ని నిలబెట్టుకుంది మాత్రం నేనే. ఆధ్యాత్మికతను, ఆచరణాత్మకతను ఎలా కలపాలి? ఇక్కడ నాలుగు ముఖ్యమైన దశలు ఉన్నాయి మీ లక్ష్యాలను స్పష్టంగా రాసుకోండి. ఇది ఆచరణాత్మకత కానీ, ఆ ప్రణాళిక అమలులో దైవ మార్గదర్శకత్వం కోరడం ఆధ్యాత్మికత. పనిలో ఉన్నప్పుడు మీరు చేసే పనే దైవంగా భావించండి. కాయకమే కైలాసం అన్న బసవన్న మాట ఇక్కడ వర్తిస్తుంది. పనిలో నైపుణ్యం చూపడమే దేవుడికి ఇచ్చే అతిపెద్ద నైవేద్యం. ఫలితం మనకు అనుకూలంగా వచ్చినా, రాకపోయినా దాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. ఇది అనవసరపు ఆందోళన నుండి మనల్ని విముక్తులను చేస్తుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒకసారి మౌనంగా ఆలోచించండి. ఈరోజు నేను ఎంత శ్రమించాను? దేవుడు నాకు ఎన్ని అవకాశాలు ఇచ్చాడు? ఈ కృతజ్ఞతా భావమే (Gratitude) నిజమైన ఆధ్యాత్మికత. నేటి ఇన్స్టంట్ యుగంలో యువత గందరగోళానికి గురవుతున్నారు. సోషల్ మీడియా సక్సెస్ చూసి అంతా రాత్రికి రాత్రే జరిగిపోవాలనుకుంటున్నారు. ఫెయిల్ అయినప్పుడు డిప్రెషన్లోకి వెళ్తున్నారు. ఇక్కడ ఆధ్యాత్మికత ఒక యాంకర్ (Anchor) లా పనిచేస్తుంది. బెంగళూరులో టెక్ రంగంలో ఉన్న ప్రసాద్ చెప్పినట్లు నేను ఆఫీసులో కోడింగ్ సమస్యలో చిక్కుకున్నప్పుడు, కాసేపు కళ్లు మూసుకుని ధ్యానం చేస్తాను. ఆ ప్రశాంతత నాకు కొత్త ఆలోచనను ఇస్తుంది. ఆధ్యాత్మికత అంటే గడ్డం పెంచుకుని అడవికి వెళ్లడం కాదు, ఉన్న చోటే మనస్సును నియంత్రించుకుని పనిని సమర్థవంతంగా చేయడం. విశ్వాసం అనేది కేవలం గుడికో, చర్చిలో, మసీదుకో పరిమితం కాకూడదు. దేవుడిని నమ్మే వ్యక్తికి సామాజిక బాధ్యత (Social Responsibility) ఎక్కువగా ఉండాలి. తన చుట్టూ ఉన్న ఆకలిని చూడని భక్తి వ్యర్థం. ఆచరణాత్మకమైన ఆధ్యాత్మికత అంటే ఎదుటివారిలో దైవాన్ని చూడటం మరియు వారికి సహాయం చేయడం. చివరగా, జీవితం అనేది దేవుడు వడ్డించిన విందు కాదు, దేవుడు ఇచ్చిన పదార్థాలతో మనం తయారు చేసుకునే విందు. మన శ్రమ ఒక చెఫ్ (Chef) అయితే మన తెలివి ఒక రెసిపీ (Recipe) అయితే మన నిబద్ధత ఒక నైపుణ్యం అయితే దేవుని దీవెనలు ఆ విందుకు అదనపు రుచి ని ఇచ్చే సుగంధ ద్రవ్యాలు.దేవుడిని నమ్ము. కానీ నీ ఒంటెను బాగా కట్టుకో అనే పాత సామెత మనకు గుర్తుంది కదా? అంటే, భద్రత కోసం తాడు కట్టడం నీ బాధ్యత, ఆ పైన రక్షణ దైవానిది. శ్రమను విస్మరించిన విశ్వాసం గుడ్డిది, విశ్వాసాన్ని విస్మరించిన శ్రమ భారమైనది. ఈ రెండింటి కలయికే ఒక పరిపూర్ణమైన, ప్రశాంతమైన మరియు విజయవంతమైన జీవితం.



పనిలో నైపుణ్యం చూపడమే దేవుడికి ఇచ్చే అతిపెద్ద నైవేద్యం. ఫలితం మనకు అనుకూలంగా వచ్చినా, రాకపోయినా దాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. ఇది అనవసరపు ఆందోళన నుండి మనల్ని విముక్తులను చేస్తుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒకసారి మౌనంగా ఆలోచించండి. ఈరోజు నేను ఎంత శ్రమించాను? దేవుడు నాకు ఎన్ని అవకాశాలు ఇచ్చాడు? ఈ కృతజ్ఞతా భావమే (Gratitude) నిజమైన ఆధ్యాత్మికత. నేటి ఇన్స్టంట్ యుగంలో యువత గందరగోళానికి గురవుతున్నారు. సోషల్ మీడియా సక్సెస్ చూసి అంతా రాత్రికి రాత్రే జరిగిపోవాలనుకుంటున్నారు. ఫెయిల్ అయినప్పుడు డిప్రెషన్లోకి వెళ్తున్నారు. ఇక్కడ ఆధ్యాత్మికత ఒక యాంకర్ (Anchor) లా పనిచేస్తుంది.



నిందితుల ఫొటోలు ఆన్‌లైన్‌లో ఉంచుతారా?

- ఇలాంటి చర్యలు విచారణకు ముప్పుగా మారుతున్నాయి
- పోలీసులు, ప్రజల తీరుపై సుప్రీం కోర్ట్ అభ్యంతరం


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 21: మొబైల్ ఫోన్లలో చిత్రించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ధోరణి పట్ల సుప్రీం కోర్టు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతుందని పేర్కొంది. నిందితుల ఫొటోలు, వీడియోలను పోలీసులు సామాజిక మాధ్యమంలో విడుదల చేస్తుండటంతో అది ప్రజల మనస్సుల్లో వారిపట్ల వ్యతిరేక భావన కలిగిస్తున్నదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐతో కూడిన ధర్మాసనం విచారించింది. పోలీసులు మీడియాకు తెలియజేసే వివరాలకు సంబంధించి అన్ని రాష్ట్రాలకు సుప్రీం కోర్టు గతంలోనే కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని సామాజిక మాధ్యమాలకు కూడా వర్తింప జేయాలని పిటిషనర్ కోరారు. ఈ సందర్భంగా నిందితులకు బేడీలు వేసి ఉన్నవి, తాళ్లతో కట్టి ఉన్నవి, అర్ధనగ్నంగా నడిపిస్తున్నవి, బలవంతంగా మోకాళ్లపై కూర్చోబెట్టి ఉన్న చిత్రాలను పోలీసులు పోస్ట్ చేస్తున్న ట్రెండ్ పెరిగిపోయిందని, ఇది ఆయా వ్యక్తుల గౌరవానికి భంగం కలిగిస్తున్నదని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు



ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలి

- ఆసెంబ్లీ ఎన్నికల వేళ ఈసీ కీలక ఆదేశాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 22: అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్ శాసనసభ ఎన్నికలతో పాటు మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ రోజున మొత్తం 2,18,807 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల కమిషనర్లకు సూచించింది. ఈ మేరకు పత్రికా ప్రకటన రిలీజ్ చేసింది. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఓటర్లు వేచి ఉండేందుకు ప్రదేశం, మరుగుదొడ్డి, తగినంత లైటింగ్, దివ్యాంగుల కోసం సరైన వాలుతో కూడిన ర్యాంప్, స్టాండర్ట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్, సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఈసీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల, యూటీల ఎన్నికల కమిషనర్లను ఆదేశించింది. అలాగే పోలింగ్ కేంద్రంలో వేచి ఉండేవారు కూర్చొనేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు, అలాగే వారి అవగాహన కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే రకమైన నాలుగు ఓటరు సౌకర్యాల పోస్టర్‌లను ప్రదర్శించాలని కోరింది. ఈ పోస్టర్‌ల్లో పోలింగ్ కేంద్రం వివరాలు, అభ్యర్థుల జాబితా, అనుమతించే ఐడెంటిటీ ప్రూఫ్స్ జాబితా, ఓటింగ్ ప్రక్రియ వివరాలు ఉండాలని చెప్పింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు తమ పోలింగ్ బూత్ నంబరును, ఓటరు జాబితాలోని క్రమ సంఖ్యను కనుగొనడంలో సహాయపడటానికి బూత్ స్థాయి అధికారులను అందుబాటులో ఉంటాలని సీఈఓ పేర్కొంది. ఓటర్లు పోలింగ్ ప్రాంగణానికి సమీపిస్తున్నప్పుడు వీఏబీలు ఓటర్లకు అవసరమైన సూచనలు, సహాయం చేయాలని సూచించింది. అలాగే పోలింగ్ స్టేషన్ ప్రవేశ ద్వారం వెలుపల ఓటర్ల కోసం మొబైల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం కల్పించాలని స్పష్టం చేసింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు తమ ఫోన్‌ను (స్విచ్ఛాఫ్ చేసి) అక్కడి వాలంటీర్‌కు ఇచ్చి, ఓటేసిన తర్వాత మళ్లీ ఫోన్‌ను తీసుకోవచ్చని వెల్లడించింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలను కల్పించాలని ఆదేశించింది. ఓటర్లకు ఎలాంటి ఆటంకాలు లేని, ఆహ్లాదకరమైన ఓటింగ్ అనుభవాన్ని అందించేందుకు, పోలింగ్ తేదీలకు చాలా ముందుగానే అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించింది.







ఇలాంటి వార్తలు ఎలా క్రియేట్ చేస్తారా?

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఫ్రాంచైజీని విరాట్ కోహ్లీ చార్టెడ్ ఫ్లైట్ డిమాండ్ చేశాడనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో మ్యాచ్‌ల మధ్య 3 రోజుల గ్యాప్ వస్తే లండన్ వెళ్లేందుకు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయాలని కోహ్లీ కోరాడని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. కన్నీటి ఏమోజీలను షేర్ చేశాడు. ఇలాంటి వార్తలు ఎలా క్రియేట్ చేస్తారా? అన్నట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు. ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని తన పోస్ట్ ద్వారా స్పష్టం చేశాడు. విరాట్ కోహ్లీ హేటర్స్ ఈ ఫేక్ వార్తను క్రియేట్ చేసినట్లు అర్థమవుతుంది. ఇప్పటికే ఆర్‌సీబీ ప్రాక్టీస్ క్యాంప్‌లో చేరిన విరాట్ కోహ్లీ.. టైటిలే లక్ష్యంగా సన్నదమవుతున్నాడు. తన సహచరులకు కూడా ఒక్క క్షణం కూడా వృథా చేయవద్దని దిశానిర్దేశం చేశాడు. శనివారం ప్రాక్టీస్ అనంతరం సహచరులతో కోహ్లీ మాట్లాడిన వీడియోను ఆర్‌సీబీ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. 'ఈ రోజులను మనం వృథా చేయకూడదు. మనం ఎప్పుడూ ముందంజలో ఉండాలి. సీజన్ మొత్తంలో ఒక్క నిమిషం కూడా వృథా కాకూడదు. మనం ఈ రెండున్నర నెలలు 120 శాతం ప్రదర్శనను ఇవ్వాలి. ఛాలెంజర్స్ కావడానికి అందరిలోనూ ఉత్సాహం ఉందని మీ ముఖాలు చేస్తే అర్థమవుతోంది.'అని కోహ్లీ పేర్కొన్నాడు.

నాలుగో టీ20లో సౌతాఫ్రికా విజయం

- సిరీస్ సమం

న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు ఆ దేశ పర్యటనకు వెళ్లిన సౌతాఫ్రికా.. నాలుగో టీ20లో గెలిచి సిరీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ఆదివారం వెల్లింగ్టన్ వేదికగా ఇరుజట్ల మధ్య జరిగిన నాలుగో టీ20లో సఫారీలు.. 19 పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించారు. లో స్కోరింగ్ థ్రిల్లర్‌గా సాగిన మ్యాచ్‌లో స్పిన్నర్ల దెబ్బకు రెండు జట్ల బ్యాటర్లు పరుగుల కోసం తంటాలు పడ్డారు. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 164 రన్స్ చేసింది. కొనర్ ఎస్తర్‌హుజెన్ (57) మినహా మిగిలిన బ్యాటర్లు తేలిపోయారు. ఛేదనలో న్యూజిలాండ్.. 18.5 ఓవర్లకు 145 రన్స్‌కే ఆలౌట్ అయింది. రాబిన్సన్ (32) టాప్ స్కోరర్. స్వల్ప ఛేదనలో పవర్ ప్లే ముగిసేసరికి 63/2గా ఉన్న ఆ జట్టు.. 82 పరుగులకు పది వికెట్లు కోల్పోయి పరాభవం వైపు నిలిచింది. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జ్ (3/31) మూడు వికెట్లు పడగొట్టగా సుబ్రయెన్, కెప్టెన్ కేశవ్, బార్ట్‌మన్ తలా రెండు వికెట్లు తీశారు. సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి టీ20 ఈనెల 25న జరుగుతుంది.



అభిమానులను ఆకట్టుకున్న సంజూ తమిళ ప్రసంగం

పొట్టి వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్ తన తొలి ప్రసంగంతోనే చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులను ఆకట్టుకున్నాడు. పంతొమ్మిదో సీజన్‌లో చెన్నైకి ఆడుతున్న సంజూ ఫ్రాంచైజీ నిర్వహించిన 'ROAR 26' కార్యక్రమంలో శాంసన్ తమిళంలో 'థ్రోమ్ థూక్రోమ్' అనే డైలాగ్ చెప్పాడు. పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో అడుగుపెట్టిన సంజూ.. ఈ డైలాగ్ చెప్పగానే ఫ్యాన్స్ శాంసన్, శాంసన్ అని గట్టిగా అరిచారు. ఐపీఎల్ ఆరంభం నుంచి తమ జట్టుకు మద్దతిస్తున్న అభిమానుల కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ 'ROAR 26' అనే స్పెషల్ లైవ్ షో నిర్వహించింది. ఆదివారం చిదంబరం (చెపాక్) స్టేడియంలో జరిగిన ఈ ఈవెంట్‌కు మాజీ సారథి ఎంఎస్ ధోనీ, శాంసన్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సహా మాజీ ఆటగాళ్లు సురేశ్ రైనా, మాథ్యూ హెడేన్, మురళీ విజయ్, బద్రీనాథ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ విజయంలో కీలకమైన సంజూ శాంసన్, శివం దూబేలను ధోనీ సత్కరించాడు. అనంతరం సంజూ మాట్లాడుతూ 'థ్రోమ్ థూక్రోమ్'అనే తమిళ డైలాగ్‌తో తన ఆట తీరును వివరించాడు. 'బంతిని చూసి కొడతాను. సాధ్యమైనన్ని సిక్సర్లు బాదడమే నా లక్ష్యం' అని ఒక్క ముక్కలో తన బ్యాటింగ్ స్టయిల్‌ను వెల్లడించాడీ హిట్టర్. ఎల్లో జెర్సీ వేసుకోవడమే కాదు.. తమిళంలోనూ తన ఆట స్టయిల్‌ను వివరించిన సంజూ సీఎస్కే ఆర్మీ మనసులు దోచుకున్నాడు. అనంతరం ఈ నైట్ షోలో సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ తన పాటల హోరుతో ఫ్యాన్స్‌ను ఫిదా చేశారు.



ఐపీఎల్‌కు ఆకాశ్‌దీప్ దూరం

ఐపీఎల్ మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉన్నది. ఇప్పటికే గాయం కారణంగా హర్షిత్ రానా లీగ్‌కు పూర్తిగా దూరం కాగా, తాజా ఈ జాబితాలో యువ పేసర్ ఆకాశ్‌దీప్ చేరాడు. వెన్నెముక గాయంతో ఆకాశ్‌దీప్ ఎనిమిది వారాల పాటు ఆటకు దూరం కానున్నాడు. దీంతో ఈనెల 28 నుంచి మొదలయ్యే ఐపీఎల్‌తో పాటు స్వదేశం వేదికగా ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు ఆకాశ్‌దీప్ అందుబాటులో లేకుండా పోయాడు. 'ఆకాశ్‌దీప్ వెన్నెముక కింది భాగంలో గాయమైంది. పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఎనిమిది నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ కారణంగా ఐపీఎల్‌తో పాటు ఆఫ్ఘానిస్థాన్‌తో టెస్టుకు అతను ఎంపికయ్యే అవకాశాలు లేవు'అని శనివారం బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. చివరిసారి రంజీ ట్రోఫీలో జమ్మూ కశ్మీర్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడిన ఈ 29 ఏండ్ల యువ పేసర్ అప్పటి నుంచి ఆటకు దూరమయ్యాడు.



కల్కి 2లో 'జేడీ చక్రవర్తి'

ప్రభాస్ లీడ్ రోల్‌లో నటించిన సైన్స్ ఫిక్షన్ జోనర్ కల్కి 2898 ఏడీ. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సీక్వెల్ కల్కి 2 కూడా రాబోతుందని తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. సీక్వెల్‌పై ఆసక్తికర వార్త ఒకటి అభిమానులు, మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. టాలీవుడ్ యాక్టర్ జేడీ చక్రవర్తి కల్కి 2 టీంతో జాయిన్ అయ్యాడట. తాజా టాక్ ప్రకారం జేడీ చక్రవర్తి హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో దుల్కర్ సల్మాన్, అమితాబ్ బచ్చన్ కలిసి జాయిన్ అయ్యాడని ఇన్‌సైడ్ టాక్. కాగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ జేడీ చక్రవర్తికి ఎలాంటి రోల్ ఇచ్చాడు.. దీనిపై నాగ్ అశ్విన్ టీం నుంచి ఏదైనా అఫీషియల్ అప్‌డేట్ వస్తుందేమో చూడాలి మరి. కల్కి 2లో దీపికా పదుకొనే ప్లేస్‌లో మరో నటిని తీసుకోనుండగా.. అది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది.



ట్రైలర్‌తో అంచనాలు పెంచిన 'బైకర్'

శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం 'బైకర్' ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టిస్తోంది. మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఇండియన్ సినిమాల్లో అరుదుగా చూసే జానర్ కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో శర్వానంద్ 'విక్కీ' అనే రేసర్ పాత్రలో స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు అభిలాష్ రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే విజువల్స్, రేసింగ్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైక్ రేసింగ్ అంటే ప్రాణం పెట్టే ఒక యువకుడు తన లక్ష్యం కోసం చేసే పోరాటాన్ని దర్శకుడు ఎమోషనల్‌గా చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. ఈ సినిమాలో మరో ప్రధాన ఆకర్షణ రాజశేఖర్ పోషించిన తండ్రి పాత్ర. శర్వానంద్‌రాజశేఖర్ మధ్య వచ్చే సన్నివేశాలు ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. తండ్రీకొడుకుల మధ్య ఉన్న భావోద్వేగాలకంటే, వారి మధ్య జరిగే ఇగో క్లాష్ కథకు కీలకంగా కనిపిస్తోంది. "నువ్వు అందరికంటే ముందు రాలేదు.. అందరూ నీకంటే వెనుక వచ్చారు" వంటి డైలాగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. టెక్నికల్ పరంగా కూడా సినిమా బలంగా కనిపిస్తోంది. సంగీత దర్శకుడు గిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మరింత ఎలివేషన్ ఇచ్చింది. "బైకర్ అంటే స్పీడ్ కాదు.. రెస్పెక్ట్" అనే డైలాగ్ సినిమా థీమ్‌ను స్పష్టంగా తెలియజేస్తోంది. రేసింగ్ కేవలం వేగం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, గౌరవం కూడా అవసరమని ఈ చిత్రం చెప్పబోతుందని అర్థమవుతోంది.



పింక్ లెహెంగాలో మిల్కీ బ్యూటీ

టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తనదైన అందం.. అభినయంతో రెండు దశాబ్దాల కాలంగా ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. కేవలం వెండితెరపైనే కాకుండా, ఫ్యాషన్ ప్రపంచంలోనూ తమన్నా తనదైన ముద్ర వేస్తోంది. తాజాగా లక్మే ఫ్యాషన్ వీక్ వేదికగా తమన్నా ధరించిన పింక్ డిజైనర్ దుస్తులు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ ఫోటో స్టోరీలో తమన్నా మెరుపులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మిల్కీ గ్లామర్ చూస్తుంటే ఇప్పటికీ కాలేజీ అమ్మాయిలాగే ఉందంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ భూమిక శర్మ రూపొందించిన ఆఫ్టర్ గ్లో కలెక్షన్‌లో భాగంగా తమన్నా ఈ పింక్ కలర్ మోడ్రన్ లెహంగాలో మెరిశారు. ఈ దుస్తుల గురించి తమన్నా స్పందిస్తూ ఈ డ్రెస్ ధరించడం చాలా సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. ఇది ప్లేఫుల్ గా, మోడ్రన్ గా ఉంటూనే ఒక రకమైన ప్రశాంతతను, మెరుపును ఇస్తోందని తన ఇన్‌స్టాలో పేర్కొన్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే వారికి ఈ లుక్ ఒక స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఆసక్తి రేకెత్తిస్తున్న యామి కొత్త సినిమా

బాలీవుడ్‌లో కంటెంట్ ఓరియెంటెడ్ కథలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యామి గౌతమ్ నయ్యి నవెల్లి అనే ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. హారర్ కామెడీ జానర్‌లో రూపొందుతున్న ఈ కొత్త సినిమా ద్వారా యామి తన కెరీర్‌లో మరో కొత్త మలుపు తీసుకోబోతున్నారు. ముఖ్యంగా కథ, డైరెక్షన్, ప్రొడక్షన్.. అన్నీ అంశాలు కలిసొచ్చే ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. బాలాజీ మోహన్ దర్శకత్వంలో.. ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నది బాలాజీ మోహన్. ప్రత్యేకమైన నేరేషన్ స్టైల్, సున్నితమైన హ్యూమర్, మరియు రియలిస్టిక్ ఎమోషన్స్‌తో గుర్తింపు పొందిన బాలాజీ మోహన్.. ఈసారి హారర్ కామెడీని ఎలా ప్రెజెంట్ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన గత సినిమాల్లో కనిపించిన ఎమోషన్స్, లైట్ హ్యూమర్ ఈ సినిమాలో కూడా కీలక పాత్ర పోషించనున్నాయి. అదే సమయంలో కథలోని మిస్టరీ ఎలిమెంట్స్‌కు ఆయన ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారన్నది ఇప్పుడు ఈ సినిమాకు హైలైట్‌గా మారొచ్చు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200